Website: www.subhatelangana.in

ఆదివారం
29 సెప్టెంబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 142
పేజీలు : 6
వెల : 3/-

RNI-TELTEL/2017/72695

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar



## అక్టోబర్‌లో మహారాష్ట్ర ఎన్నికలు

- నవంబర్ 26వ తేదీతో ముగియనున్న అసెంబ్లీ గడువు
- రెండు విడతల్లో ఎన్నికలు జరిగే అవకాశం
- ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న ఎన్నికల నేరాలపై విచారణను వేగవంతం చేయాలని రాష్ట్ర పోలీస్ అధికారులను ఆదేశం
- అసెంబ్లీ ఎన్నికల సన్నాహకాలపై సమీక్షించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్


# ఫ్యామిలీ కార్డులో యజమానిగా మహిళ



- సంక్షేమ పథకాల్లోని సమాచారం ఆధారంగా కుటుంబాల నిర్ధారణ
- నియోజకవర్గానికి రెండు ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు
- 3 నుంచి క్షేత్రస్థాయి పరిశీలన.. అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్!.. మంత్రివర్గ ఉపసంఘం యోచన

**శుభ తెలంగాణ హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డులో.. మహిళను కుటుంబ యజమానిగా గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇతర కుటుంబ సభ్యుల పేర్లు, వారి వివరాలను కార్డు వెనుక పేర్కొనాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, వ్యవసాయ, ఇతర సంక్షేమ పథకాల్లోని సమాచారం ఆధారంగా డిజిటల్ కార్డుకు కుటుంబాల నిర్ధారణ చేయాలన్నారు. శనివారం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల అంశంపై సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న కార్డులను పరిశీలించి ఉత్తమ విధానాలు స్వీకరించాలని సూచించారు. - మిగతా3లో



## త్వరలోనే కొత్త ఇంటర్నెట్

- ఏ మూలకైనా అదిరిపోయే సిగ్నల్..
- ట్రాయ్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు
- శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వస్తే మారుమూల గ్రామాల్లో వేగవంతమైన అంతర్జాల సేవలు అందుబాటులోకి

## జనతా గ్యారేజీని తలపిస్తున్న బీఆర్ఎస్ ఆఫీస్

- తెలంగాణ భవన్‌కు హైడ్రా బాధిత కుటుంబాలు
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పేరుతో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తున్నది.
- దీనికితోడు ఆపరేషన్ మూసీ పేరుతో మూసీ నది పరివాహక ప్రాంతాల్లో అధికారులు మార్కింగ్
- ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటున్న ప్రజలు



**శుభ తెలంగాణ హైదరాబాద్**

జనతా గ్యారేజీ సినిమాలో వివిధ సమస్యలు చెప్పుకోవడానికి జనతా గ్యారేజీని సంప్రదించినట్టుగానే ఇప్పుడు బీఆర్ఎస్ ఆఫీస్‌కు హైడ్రా బాధితులు క్యూ కడుతున్నారు. ఉదయం నుంచి ఆ ప్రాంతమంతా జనంతో కిక్కిరిసిపోయింది. ప్రజా సమస్యలు వినేందుకు మాజీ మంత్రులు, బీఆర్ఎస్‌లో కీలక నేతలంతా ఆఫీస్‌లోనే ఉంటున్నారు. బాధితులు చెబుతున్న సమస్యలను వింటున్నారు. వాటిని నోట్ చేస్తున్నారు. ఈ మధ్య హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజలతో మాట్లాడారు. వారి ఆవేదన తెలుసుకున్నారు. హైడ్రా కూల్చివేతలపై మండిపడ్డారు. ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వారి ఇళ్లను కూల్చేస్తున్న ప్రభుత్వం - మిగతా3లో

## హైడ్రా అంటే భరోసా, బాధ్యత

- ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించే బాధ్యత హైడ్రాకు ఉంది
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకే సీఎం హైడ్రాను తీసుకొచ్చారు
- విపత్తు నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ హైడ్రా బాధ్యత
- అక్రమ కట్టడాలను మాత్రమే కూల్చివేశాం
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



**శుభ తెలంగాణ హైదరాబాద్**

ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించే బాధ్యత హైడ్రాకు ఉందని కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. హైడ్రా అంటే భరోసా, బాధ్యత.. దీనిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయొద్దని ఆయన సూచించారు. మూసీ, హైడ్రాపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఏవీ రంగనాథ్ మాట్లాడారు. కొన్ని కట్టడాలను కూల్చితే హైడ్రా బాగా పని చేస్తుందని కితాబిచ్చారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకే సీఎం హైడ్రాను తీసుకొచ్చారు. విపత్తు నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ హైడ్రా బాధ్యత. ఎన్ కన్వెన్షన్‌ను కూల్చేశాం.. - మిగతా3లో



## వందే భారత్ అంతర్జాతీయ డిమాండ్

- కొనుగోలుకు కెనడా సహా పలు దేశాల ఆసక్తి..!
- ఈ రైళ్లకు దేశవ్యాప్తంగా డిమాండ్
- ఈ క్రమంలోనే పలు దేశాలు సైతం సెమీ హైస్పీడ్ రైళ్లపై దృష్టి
- వందే భారత్‌లో ఉన్న అత్యాధునిక సౌకర్యాలతో రైళ్లను తయారు చేసేందుకు రూ.160 నుంచి రూ.180కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా.
- ఇది జపాన్ బుల్లెట్ రైలు కంటే ఎక్కువ.

## డిక్లరేషన్‌పై అనవసర రాద్ధాంతం

- జగన్ తీరు హిందుత్వంపై దాడి
- డిక్లరేషన్ ఇస్తే తప్పేంది?
- అన్యమతస్తులు హిందూ ఆలయాల్లోకి ప్రవేశిస్తే డిక్లరేషన్ ఇచ్చిన ఉదంతాలెన్నో ఉన్నాయ్
- దళితులు అసలైన హిందూ ధర్మ రక్షకులు
- దళితులను క్రిస్టియన్లు గా మార్చే కుట్ర సాగుతోంది
- బీఫ్ తినేటోళ్లను, నక్సలైట్ల భావజాలమున్న వాళ్లను విద్యా కమిషన్‌లో చోటు కల్పిస్తారా?



**శుభ తెలంగాణ హైదరాబాద్**

ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తిరుమల డిక్లరేషన్‌పై రాద్ధాంతం చేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని బండ్లగూడ జాగీర్‌లో శ్రీ విద్యారణ్య నూతన భవన ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ దళితులకు తిరుమలలో అన్యాయం జరుగుతోందని చెప్పడం సిగ్గు చేటన్నారు. దళితులే అసలైన హిందూ ధర్మ రక్షకులని చెప్పారు. దళితులపై లేనిపోని ప్రేమ ఒలకబోస్తూ క్రిస్టియన్లుగా మార్చే కుట్ర జరుగుతోందన్నారు. జగన్ పాలనలో ఎంత మంది దళితులకు తిరుమలలో అన్యాయం జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. అన్యమతస్తులు తిరుమల వస్తే డిక్లరేషన్ ఇవ్వాలనే నిబంధనలు కొత్తగా పెట్టిన నిబంధన కాదని, అలాంటి తిరుమలకు క్రిస్టియన్ అయిన - మిగతా3లో

## సీఎం రేవంత్ రెడ్డికి కోదండరాం సహా విద్యావేత్తల బహిరంగ లేఖ

- అంబేద్కర్ యూనివర్సిటీ భూమిని ఫైన్ ఆర్ట్స్ వర్సిటీకి కేటాయించడంపై లేఖ
- ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోదండరాం సహా విద్యావేత్తల డిమాండ్
- అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వెల్లడి



# బీజేపీ సర్కార్ తథ్యం

**జమ్మూ:** తొలి రెండు విడతల పోలింగ్ అనంతరం జమ్మూకశ్మీర్‌లో తొలిసారి పూర్తి మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమైందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. అక్టోబర్ 1న తుది విడత పోలింగ్ నేపథ్యంలో శనివారంనాడిక్కడ జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఉగ్రవాదం, అవినీతి అంశాలకు సంబంధించి కాంగ్రెస్, దాని భాగస్వామ్య పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్, మెహబూబా ముఫ్తీ సారథ్యంలోని పీడీపీపై విమర్శలు గుప్పించారు.

"మొదటి రెండు విడతల పోలింగ్ సరళితో బీజేపీ తొలిసారి జమ్మూకశ్మీర్‌లో పూర్తి మెజారిటీ సాధించడం ఖాయమైంది. బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు. రెండు విడతల్లో ప్రజలు భారీగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ గెలుపు తథ్యంగా కనిపిస్తోందన్నారు. ప్రజల అభిమతంతో తొలిసారి జమ్ముకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పడనుందన్నారు. బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే మంచి అవకాశాన్ని వదులుకోవద్దని సూచించారు. జమ్ములో ఎన్నో ప్రసిద్ధ ఆలయాలు ఉన్నాయన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి బీజేపీ కృషి చేస్తుందన్నారు. దీంతో బీజేపీ గెలుపు తథ్యమైంది" అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ప్రజల అభిమతంతో తొలిసారి జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం



ఏర్పడనుందని, ఇక్కడ ఎన్నో ఆలయాలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని వదులుకోవద్దని, బీజేపీ ప్రభుత్వం ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుందని భరోసా ఇచ్చారు.

**మూడు కుటుంబాలు**

జమ్మూకశ్మీర్‌లోని కాంగ్రెస్, ఎన్‌సీ, పీడీపీల 'మూడు కుటుంబాల' పాలనతో ప్రజలు విసిగిపోయారని, ప్రజలు శాంతిని కోరుకుంటున్నారని ప్రధాని అన్నారు. అవినీతి, ఉద్యోగాల్లో వివక్ష తిరిగి చోటుచేసుకోరాదని, వేర్పాటువాదం, రక్తపాతానికి ఇంకెంతమాత్రం చోటులేదని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. "ఇక్కడి ప్రజలు శాంతిని కోరుకుంటున్నారు. తమ పిల్లలకు మంచి భవిష్యత్తును ఆశిస్తున్నాను. ఆ కారణంగానే జమ్మూకశ్మీర్ ప్రజలు బీజేపీ పాలన రావాలని కోరుకుంటున్నారు" అని మోదీ అన్నారు.


**సర్జికల్ దాడుల ప్రస్తావన**

సరిహద్దు ఉగ్రవాదంపై సర్జికల్ దాడులతో ప్రపంచానికి తాము స్పష్టమైన సందేశం ఇచ్చామన్నారు. ఇది సరికొత్త ఇండియా అని, ఉగ్రవాదాన్ని సహించేది లేదన్నారు. ఉగ్రవాదులు తెగబడితే వారెక్కడున్నా మోదీ వెతికి పట్టుకుంటారనే విషయం వారికి బాగా తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం సర్జికల్ దాడులకు ఆధారాలు చూపించాలని ఆర్మీని నిలదీస్తోందన్నారు. 2016 సెప్టెంబర్ 18న భారత్ చేపట్టిన సర్జికల్ దాడులను ప్రధాని గుర్తుచేస్తూ, సరిహద్దు ఉగ్రవాదంపై సర్జికల్ దాడులతో ప్రపంచానికి తాము విస్పష్టమైన సందేశం ఇచ్చామని, ఇది న్యూ ఇండియా అని, ఉగ్రవాదాన్ని సహించేది లేదని చాలా స్పష్టంగా తెలియజేశామని అన్నారు. ఉగ్రవాదులు తెగబడితే వారెక్కడున్నా మోదీ వెతికి పట్టుకుంటారనే విషయం వారికి బాగా తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం సర్జికల్ దాడులకు ఆధారాలు చూపెట్టమని ఆర్మీని నిలదీస్తోందని ప్రధాని విమర్శించారు. కాగా, అక్టోబర్ 1న జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల తుది (మూడవ) విడత పోలింగ్ జరుగనుంది. అక్టోబర్ 8న ఫలితాలు వెలువడతాయి.

# త్వరలోనే కొత్త ఇంటర్నెట్..

మొబైల్ ఇంటర్నెట్, బ్రాడ్ బాండ్, వైర్ లెస్ ఇలా రకరకాల ఇంటర్నెట్లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. ఇవ్వన్నీ పనిచేయాలంటే ఆయా సంస్థలకు సంబంధించిన టవర్ సిగ్నల్స్ ఆధారంగా పనిచేస్తాయి. సిగ్నల్ తక్కువుగా ఉంటే ఇంటర్నెట్ స్లోగా పనిచేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఇంటర్నెట్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. ఉన్నప్పటికీ స్పీడ్ తక్కువుగా ఉంటుంది. దీంతో ట్రాయ్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా శాటిలైట్ ఇంటర్నెట్ సేవల కోసం స్పెక్ట్రమ్ కేటాయింపు, ధరల నిర్ణయంపై ట్రాయ్ సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించింది. దేశంలోని ఇంటర్నెట్ సేవలు అందిస్తున్న కొన్ని సంస్థలకు శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు అందించేందుకు అనుమతి లభించనుంది. టెలికాం చట్టం 2023 ప్రకారం అడ్మినిస్ట్రేటివ్ ప్రక్రియ ద్వారా వేలం లేకుండా శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు స్పెక్ట్రమ్‌ను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) సంప్రదింపుల ప్రక్రియలో భాగంగా శాటిలైట్ కంపెనీలకు స్పెక్ట్రమ్ కేటాయించే ప్రత్యామ్నాయ మార్గాలపై అభిప్రాయాలను కోరుతోంది. మొత్తం 21 అంశాలపై అభిప్రాయాలను ఆహ్వానించింది. స్పెక్ట్రమ్ ఛార్జీలను నిర్ణయించే పద్ధతి, శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల కోసం ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌లు, స్పెక్ట్రమ్ కేటాయింపు మొదలైనవి ఇందులో ఉన్నాయి.

**వేలం లేకుండా..**





ట్రాయ్ టెలికం సంస్థలకు వేలం ద్వారా స్పెక్ట్రమ్‌ను కేటాయిస్తూ వస్తోంది. తాజాగా శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు సంబంధించి స్పెక్ట్రమ్ కేటాయింపును వేలం ప్రక్రియ ద్వారా కాకుండా అడ్మినిస్ట్రేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వస్తే మారుమూల గ్రామాల్లో వేగవంతమైన అంతర్జాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. నేరుగా శాటిలైట్ ద్వారా సిగ్నల్స్ రావడం ద్వారా టవర్లతో సంబధం లేకుండా ఏ ప్రాంతంలో అయినా ఇంటర్నెట్ సేవలను ఉపయోగించుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ సేవలు అందుబాటులోకి వస్తే మొబైల్, టీవీ, ఇంటర్నెట్ సేవలు సరసమైన ధరల్లో లభించనున్నాయి.

**వేగంగా ఇంటర్నెట్ సేవలు..**

శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వస్తే భారత దేశ కమ్యూనికేషన్ వ్యవస్థ మరింత బలపడనుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇంటర్నెట్ స్పీడ్ కంటే వేగవంతమైన స్పీడ్‌తో అంతర్జాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీనికి సంబంధించిన ధరలను ట్రాయ్ త్వరలోనే ప్రకటించనుంది. శాటిలైట్ ఇంటర్నెట్‌తో సేవలు అందుబాటులోకి వస్తే ఎటువంటి వైర్లతో సంబంధం లేకుండా వైర్ లెస్ట్ సేవలు అందనున్నాయి. కనీసం 12 నుంచి 150 ఎంబీపీఎస్ వేగంతో ఈ ఇంటర్నెట్ సేవలు అందించనుంది.

## అక్టోబర్‌లో మహారాష్ట్ర ఎన్నికలు



**ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సన్నాహకాలను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ శనివారంనాడిక్కడ సమీక్షించారు. ఆయనతో పాటు ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, ఎస్.ఎస్.సంధు, జిల్లా ఎలక్టోరల్ అధికారులు ఎస్‌పీ, మున్సిపల్ కమిషనర్లు, డివిజనర్ కమిషనర్లు, పలువురు ప్రభుత్వ సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో లోక్‌సభ ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న ఎన్నికల నేరాలపై విచారణను వేగవంతం చేయాలని రాష్ట్ర పోలీస్ అధికారులను ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ అదేశించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఎన్నికల తేదీలపై అడిగిన ప్రశ్నలకు రాజీవ్ కుమార్ సమాధానమిస్తూ, మహారాష్ట్రలోని 288 నియోజకవర్గాల్లో 25 ఎస్‌సీ, 29 ఎస్టీ నియోజకవర్గాలు ఉన్నట్టు చెప్పారు. ప్రస్తుత మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబర్ 26వ తేదీతో ముగుస్తుందని, అందువల్ల ఆ తేదీకి ముందే ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంటుందని వివరించారు. రాష్ట్రంలో మొత్తం 9.59 కోట్ల అర్హులైన ఓటర్లు ఉన్నారని, వారిలో 4.59 కోట్ల మంది పురుషులు, 4.64 కోట్ల మంది స్త్రీలు ఉన్నట్టు చెప్పారు. 18-19 ఏళ్లు కలిగి తొలిసారి ఓటింగ్ హక్కు పొందిన వారి సంఖ్య ప్రోత్సహకరంగా ఉందని, వీరు సుమారు 19.48 లక్షల వరకూ ఉంటారని చెప్పారు. నవంబర్ 26వ తేదీతో అసెంబ్లీ గడువు ముగియనుందని ఈసీ వివరించిన నేపథ్యంలో అక్టోబర్‌లో ఎన్నికలు ఉంటాయని, రెండు విడతల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## ముప్పై ఏళ్ల క్రితం కొడుకుల చేతిలో తండ్రి దారుణహత్య..
## ఇంట్లోనే సమాధి.. తాజాగా వెలుగులోకి..!

సరిగ్గా మూడు దశాబ్దాల క్రితం కనిపెంచిన కొడుకులే కన్నతండ్రిని దారుణంగా హత్యచేశారు. అతి కిరాతకంగా చంపేసి ఇంట్లోనే పూడ్చిపెట్టారు. ఆ తర్వాత విషయం బయటికి రాకుండా జాగ్రత్తపడ్డారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హాథ్రాస్ జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఇంట్లో తవ్వి చూడగా అస్థిపంజరం బయటపడింది. వివరాల్లోకి వెళ్తే.. 1994లో తన తండ్రి బుధమ్ సింగ్ కనిపించకుండా పోయాడని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు మృతుడి కుమారుడు పంజాబీ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు తొమ్మిదేళ్ల వయస్సు ఉన్నప్పుడు ఇద్దరు సోద రులు మరో వ్యక్తితో కలిసి.. తన తండ్రితో గొడవపడ్డారని, ఆ తర్వాత నుంచి తన తండ్రి కనిపించకుండా పోయాడని పంజాబీ సింగ్ కలెక్టర్ కు తెలిపాడు. దాంతో వెంటనే కేసు దర్యాప్తు చేయాలని కలెక్టర్ పోలీసులను ఆదేశించాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఇంట్లో తవ్వి అస్థిపంజరాన్ని బయటకు తీశారు. డీఎన్ఏ పరీక్షల నిమిత్తం అస్తి పంజరాన్ని ల్యాబ్‌కు పంపించారు. కాగా బుధమ్ సింగ్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో



కన్న కొడుకులే ఆయనను హత్య చేశారు. అయితే 30 ఏళ్ల క్రితం తండ్రితో సోదరులు గొడవపడిన విషయం పంజాబీ సింగ్‌కు గుర్తుకొచ్చింది. దాంతో పంజాబీసింగ్ అప్పట్లో గొడవ దేనికి జరిగిందని, ఆ గొడవ తర్వాత తండ్రి ఏమయ్యాడని తన సోదరులను ప్రశ్నించాడు. దాంతో సోదరులు పంజాబీ సింగ్‌ను బెదిరించారు. దాంతో తన తండ్రి అదృశ్యానికి సోదరులే కారణమని పంజాబీ సింగ్ ఫిర్యాదు చేశాడు. అస్తిపంజరాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు డీఎన్ఏ టెస్టు కోసం పంపించారు. డీఎన్ఏ ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## హిజ్బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా హతం

**ఇజ్రాయెల్ ప్రకటన**

**మధ్య ప్రాచ్యంలో ఉగ్రవాద సంస్థలపై ఇజ్రాయెల్ పంజా**

**కీలక నేతలను మట్టుబెడుతున్న ఇజ్రాయెల్ దళాలు**

**నస్రల్లా బీరూట్ శివార్లలో ఉన్నాడని కచ్చితమైన సమాచారం అందించిన నిఘా వర్గాలు**

**దూసుకెళ్లిన ఇజ్రాయెల్ వాయుసేన జెట్ ఫైటర్లు**

ప్రమాదకర ఉగ్రవాద సంస్థ హిజ్బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా హతమైనట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. లెబానాన్ లోని బీరూట్ నగర శివార్లలో నిన్న జరిపిన దాడిలో హసన్ నస్రల్లా మరణించాడని ఇజ్రాయెల్ భద్రతా బలగాలు వెల్లడించాయి. ఈ భీకర దాడిలో నస్రల్లాతో పాటు హిజ్బొల్లా అగ్రశ్రేణి కమాండర్ అల్ కరాచీ కూడా ఉన్నట్టు ఇజ్రాయెల్ పేర్కొంది. నిఘా వర్గాలు అందించిన పక్కా సమాచారంతో ఇజ్రాయెల్ వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్లు బీరూట్ దిశగా దూసుకెళ్లాయి. హిజ్బుల్లా కేంద్ర కార్యాలయంపై బాంబుల వర్షం కురిపించాయి. ఇజ్రాయెల్ సర్వ సైన్యాధికారి దీనిపై స్పందిస్తూ, ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి ఇది ముగింపు కాదని, తమ దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ పౌరులకు ముప్పుగా పరిణమించే ఎవరినైనా సరే... ఎలా వారి అంతు తేల్చాలో మాకు తెలుసు... ఇంతకంటే స్పష్టమైన సందేశం ఇవ్వలేం అని పేర్కొన్నారు. నస్రల్లా కథ ముగిసింది... ఇక అతడు ఎంత మాత్రం ప్రపంచాన్ని ఉగ్రవాదంతో భయపెట్టలేడు అని ఆ ప్రధాన సైన్యాధికారి తెలిపారు.

## హిజ్బుల్లా చీఫ్ హతం

**న్యూఢిల్లీ :** ఇప్పటి వరకు ఇది అనుమానంగా ఉండేది. ఇప్పుడు ఇజ్రాయెల్ అర్మీయే ప్రకటించింది. బీరూట్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ భీకరమైన దాడులు చేసింది. మెరుపు దాడులతో ఆ ప్రాంతమంతా భీతిల్లింది. హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లా అక్కడ ఉన్నారన్న ఏకైక కారణంతో సడెన్‌గా వైమానికి దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ ఆర్మీ ఇప్పటికే ప్రకటించింది. ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఆరు భవనాలు నేల మట్టమయ్యాయని పేర్కొన్న హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థ నస్రల్లా క్షేమంగా ఉన్నట్టు పేర్కొంది. అయితే ఇప్పుడు దీన్ని ఖండించిన ఇజ్రాయెల్ ఆర్మీ మాత్రం సంచలన ప్రకటన చేసింది. హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా హతమయ్యాడని ఇజ్రాయెల్ తేల్చి చెప్పింది. హసన్ నస్రల్లా ఏ మాత్రం ప్రమాదకారి కాదని ప్రపంచంలో ఎలాంటి దాడులు చేయలేడని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ప్రకటించింది. హసన్ నస్రల్లా 32 సంవత్సరాల పాటు సంస్థకు చీఫ్‌గా ఉన్నారు.నస్రల్లా హతమైనట్లు ఇజ్రాయెల్ ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ నదవ్ శోషని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ంఈఖ నివేదికప్రకారం, లెబనాన్ రాజధాని బీరూట్‌పై శుక్రవారం (27 సెప్టెంబర్ 2024) జరిగిన వైమానిక దాడిలో హిజ్బుల్లా చీఫ్ మరణించినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రతినిధి డేవిడ్ అవ్రహం తెలిపారు. టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ నివేదిక ప్రకారం, హిజ్బుల్లా ప్రధాన కార్యాలయంపై దాడి చేశామని, అక్కడ హసన్ నస్రల్లా కూడా ఉన్నాడని సైన్యం పేర్కొన్నట్టు రిపోర్టు చేసింది. చాలా కాలంగా బీరుట్‌తో సహా పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ సైన్యం నిరంతరం దాడులు చేస్తోంది. బీరుట్‌లోని దహియా నగరంలో నివసిస్తున్న ప్రజలను వెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని ఎఆఈ సూచించింది. ఇజ్రాయెల్‌పై దాడిని అడ్డుకునేందుకు అక్కడ ఉండే ప్రజలను రక్షణ కవచాలుగా హిజ్బుల్లా వాడుకుంటోందన్న కారణంతో ప్రజలను ఖాళీ చేయాలని సూచించారు.

ఇజ్రాయెల్ న్యూస్ ఛానెల్ ప్రకారం... నస్రల్లాతోపాటు, అతని కుమార్తె జైనాబ్ కూడా మరణించారు. ఇజ్రాయెల్ దాడి చేసిన కమాండర్ సెంటర్‌లో నస్రల్లా కుమార్తె మృతదేహం గుర్తించారు. శుక్రవారం రాత్రి హిజ్బుల్లా ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ క్షిపణిని ప్రయోగించింది. ఇందులో 6 మంది మరణించారు, 90 మంది గాయపడ్డారు.

## వందే భారత్ అంతర్జాతీయ డిమాండ్



భారతీయ రైల్వేలో మోదీ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వందే భారత్ రైళ్లు దేశవ్యాప్తంగా వివిధ మార్గాల్లో దూసుకెళ్తున్నాయి. ఈ రైళ్లకు దేశవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతున్నది. ఈ క్రమంలోనే పలు దేశాలు సైతం సెమీ హైస్పీడ్ రైళ్లపై దృష్టి సారిస్తున్నాయి. చిలీ, కెనడా, మలేషియా వంటి దేశాలు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి. దీనిక ప్రధాన కారణంగా ఖర్చు. వందే భారత్‌లో ఉన్న అత్యాధునిక సౌకర్యాలతో రైళ్లను తయారు చేసేందుకు రూ.160 నుంచి రూ.180కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. అయితే, భారత్‌లో వందే భారత్ రైలును తక్కువగా ఖర్చుతో తయారు చేస్తున్నారు. దాదాపు రూ.120 నుంచి రూ.130 కోట్ల వరకు ఖర్చవుతున్నది. ఇక వేగం విషయంలోనూ ఇతర దేశాలకు చెందిన రైళ్లతో పోటీపడుతున్నది. వందే భారత్ రైలు 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని ఆదుకునేందుకు కేవలం 52 సెకన్ల సమయం పడుతున్నది. ఇది జపాన్ బుల్లెట్ రైలు కంటే ఎక్కువ. జపాన్ బుల్లెట్ రైలు 0-100 కిలోమీటర్ల వేగాన్ని ఆదుకునేందుకు 54 సెకన్లు పడుతుంది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రైల్వేశాఖ తీసుకువస్తున్నది. రైలు ప్రమాణంలో వంద రెట్లు తక్కువ శబ్దం వస్తుంది. అలాగే, పవర్ వినియోగం తక్కువగా ఉంటుంది. ఇక భారతీయ రైల్వే వందే భారత్ ట్రాక్ నెట్‌వర్క్‌ను విస్తరించడంతో పాటు రైళ్ల సంఖ్యను పెంచాలని యోచిస్తున్నది. గత పదేళ్లలో 31వేల కిలోమీటర్లకు పైగా ట్రాక్‌లను వేసినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దీన్ని 40వేలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బుల్లెట్ రైలు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. భద్రతాపరమైన ఆందోళన మధ్య రైల్వే స్వదేశీ ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ 'కవచ్'ని సైతం దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసేందుకు శ్రద్ధ చూపుతున్నది. కవచ్ సమర్థవంతంగా సమర్థవంతంగా పని చేస్తుండగా.. ఎస్ఐఎల్-4 సర్టిఫికెట్ సైతం పొందింది. ఈ షీల్డ్‌లను అంతా ఏర్పాటు చేస్తే 80శాతం ప్రమాదాలను తగ్గించవచ్చని విలేకరులతో రైల్వేశాఖ మంత్రి తెలిపారు.

## ఎండీసీ ఎన్నికల్లో రాజ్యాంగాన్ని ఉల్లంఘించారు..
## సుప్రీంకోర్టుకు వెళ్తాం.. : సీఎం అతిషీ




ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఖాళీగా స్టాండింగ్ కమిటీ స్థానానికి శుక్రవారం ఓటింగ్ జరిగింది. ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ ఎన్నికల్లో పాల్గొనలేదు. అయితే, ఎండీసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికను ఆప్ రాజ్యాంగ, చట్ట విరుద్ధమని ఆమ్ ఆద్మీ పార్టీ పేర్కొంది. ఎన్నిక అక్రమ పద్ధతిలో జరిగిందని.. ఎన్నికల్లో లెఫ్టినెంట్ గవర్నర్, బీజేపీ, వారి అధికారులు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఉల్లంఘించారని సీఎం అతిషీ ఆరోపించారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. 18వ ఎండీసీ సభ్యుడి కోసం శుక్రవారం ఎన్నిక జరగ్గా.. ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల్లో పాల్గొనలేదు. బీజేపీ కౌన్సిలర్స్ మాత్రమే పాల్గొని ఓటు వేశారు. దాంతో అధికారులు బీజేపీ అభ్యర్థి విజయం సాధించినట్లు ప్రకటించారు. ఈ ఎన్నికలపై సీఎం అతిషీ మాట్లాడుతూ.. మన దేశం రాజ్యాంగ, రాజ్యాంగం ద్వారా రూపొందించిన చట్టాలపై నడుస్తుందన్నారు. పార్లమెంట్ ఓ చట్టాన్ని ఆమోదించిందన్నారు. కార్పొరేషన్ సమావేశంలో దాని తేదీ, సమయం, స్థలాన్ని మేయర్ మాత్రమే నిర్ణయిస్తారని.. కార్పొరేషన్ సమావేశానికి మేయర్ మాత్రమే అధ్యక్షత వహిస్తారన్నారు. ప్రజాస్వామ్య ఉల్లంఘన, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఉల్లంఘించినా బీజేపీ పట్టించుకోదని, అధికారాలు లేకపోయినా లెఫ్టినెంట్ గవర్నర్ ఉత్తర్వులు ఇస్తారని, కమిషనర్ ఆదేశాలను పాటించి కార్పొరేషన్ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహిస్తారని అతిషి విమర్శించారు. ఎన్నికైన మేయర్ స్థానంలో ఏఐఎస్ అధికారిని అధ్యక్షుడిగా చేస్తుందన్నారు. వివాదాల మధ్య శుక్రవారం జరిగిన ఎన్నికల్లో బీజేపీకి చెందిన సుందర్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆప్, కాంగ్రెస్ బహిష్కరించగా.. 115 ఓట్లతో సుందర్ సింగ్ తన్వర్ విజయం సాధించినట్లు ప్రకటించారు. 18 మంది సభ్యుల కమిటీలో బీజేపీకి 10, ఆప్‌కి ఎనిమిది మంది సభ్యులున్నారు. వాస్తవానికి గురువారం అర్ధరాత్రి ఎన్నికలు జరగాల్సి ఉన్నా.. వాయిదాపడింది. ఎల్‌జీ ఆదేశాల మేరకు శుక్రవారం మళ్లీ సభను సమావేశ పరిచారు. అయితే, అయితే మేయర్ షైలీ ఒబెరాయ్, డిప్యూటీ మేయర్ అలె ఇక్బాల్, సీనియర్ కౌన్సిలర్ ముఖేష్ గోయల్ అధ్యక్షత వహించేందుకు నిరాకరించారు. ఆ తర్వాత కమిషనర్ ఎన్నికల నిర్వహణకు ప్రిసైడింగ్ అధికారిగా అదనపు కమిషనర్ జితేంద్ర కుమార్‌ను నియమించారు. ఒంటిగంటకు అడిషనల్ కమిషనర్ సమావేశానికి ప్రిసైడింగ్ అధికారిగా వచ్చి ఎన్నికలు నిర్వహించారు. ఈ సమయంలో బీజేపీకి చెందిన మొత్తం 115 మంది సభ్యులు హాజరయ్యారు. ఓటింగ్ సమయంలోనూ ఓటు వేయని సభ్యుల పేర్లను పిలిచారు. చివరకు ఎవరూ రాకపోవడంతో బీజేపీ అభ్యర్థి 115 ఓట్లతో గెలిచినట్లు ప్రకటించారు.

Follow: subhatelangana
శుభ తెలంగాణ
ఆదివారం | మేడ్చల్
29 సెప్టెంబర్ 2024
www. subhatelangana.in


# డిక్లరేషన్‌పై అనవసర రాద్ధాంతం

-మొదటిపేజీ తరువాయి

జగన్ వెళుతున్నప్పుడు డిక్లరేషన్ ఇస్తే వచ్చే ఇబ్బంది ఏమిటి? ప్రశ్నించారు. గతంలో పూరి ఆలయానికి వెళితే ఇందిరాగాంధీ పార్శి మతస్తుడిని పెళ్లి చేసుకుందని రానివ్వలేదని గుర్తుచేశారు. నేపాల్ పశుపతినాథ్ ఆలయానికి వెళ్ళిన సోనియాగాంధీ క్రిస్టియన్ కాబట్టి రానివ్వలేదని, అంత మాత్రాన దాడి జరిగినట్లా?"అని ప్రశ్నించారు. బొట్టు పెట్టుకొని టోపీ పెట్టుకోకుండా మక్కా మసీదుకు హిందువులు వెళితే వాళ్లు అనుమతిస్తారా? అని ప్రశ్నించారు. ప్రార్ధనలు చేయకుండా వాటికన్ సిటీ, జెరూసలెంకు హిందువులు వెళతానంటే ఒప్పుకుంటారా? అని పేర్కొన్నారు. తిరుమల విషయంలోనే ఎందుకింత రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. జగన్ తీరును చూస్తుంటే టీటీడీ లడ్డూ ప్రసాదంలోనూ కల్తీ చేసినట్లు అనిపిస్తుందన్నారు. ఇది ముమ్మాటికీ హిందుత్వంపై జరుగుతున్న దాడిలో భాగమేనన్నారు. దీనిని అడ్డుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్క హిందువుపై ఉందిన్నారు.తను కరీంనగర్ శిశు మందిర్ పాఠశాల విద్యార్థిని అని, ఘోష్ ప్రముఖ్‌గా ఇక్కడికి వచ్చి బహుమతి గెలుచుకున్న రోజులు తనకు గుర్తుకు వస్తున్నట్లు



చెప్పారు. దేశం, ధర్మాన్ని బోధించే స్కూల్‌ను అభివృద్ధి చేసుకునే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ర్యాంకుల కోసం పనిచేసే పాఠశాల విద్యారణ్య మందిరం కాదని, విజా&ఝనంతోపాటు ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే సంస్థ శిశు మందిర్ అని పేర్కొన్నారు. మమ్మీ, డాడీ కల్చర్‌కు వ్యతిరేకమని, మమ్మీ అంటే దెయ్యం, డాడీ అంటే గాడిద అని తెలిపారు.తల్లిదండ్రులను గౌరవించాల నుకుంటే అమ్మానాన్న అని పిలవాలన్నారు. డబ్బు సంపాదనలో పడి తల్లిదండ్రులను కూడా మర్చిపోతున్నారని చెప్పారు. తల్లిదండ్రులను కూడా. తల్లిదండ్రులపట్ల గౌరవ భావాన్ని పెంచుతున్న ఏకైక విద్యా సంస్థ శిశు మందిర్ మాత్రమేనని పేర్కొన్నారు. ఉన్నతమైన విద్యా కమిషన్‌లో ఛైర్మన్, సభ్యుల బ్యాక్ గ్రౌండ్‌ను ఒకసారి పరిశీలించాలని, కమ్యూనిస్టు భావజాలం ఉన్న వాళ్లను, ఈ దేశ మూలాలు, సంస్కృతి, సంప్రదాయం గురించి పెద్దగా అవగాహన లేనివారే ఉన్నారని చెప్పారు.తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూలను కూడా కల్తీ చేసే దుస్థితి వచ్చిందన్నారు. జగన్ పాలనలో శేషాచలం కొండలల్లో ఎర్ర చందనం స్మగ్లింగ్ చేస్తూ ఏడు కొండలను రెండు కొండలకే పరిమితం చేసే కుట్ర జరుగుతుందన్నారు. తిరుమలకు అన్యమతస్తులు వస్తే డిక్లరేషన్ ఇవ్వాలనేది నిబంధన ఉందన్నారు. కానీ జగన్ సీఎంగా ఉంటూ డిక్లరేషన్ ఇవ్వకుండా తిరుమలను దర్శించుకుని నిబంధనలను ఉల్లంఘించినట్లు చెప్పారు. అసలు నిజమైన హిందూ ధర్మ రక్షకులు దళితులేనని పేర్కొన్నారు. వాళ్లకు అన్యాయం జరిగిందని సాకుతో దళితులను క్రిస్టియన్ మతంలోకి మార్చే కుట్ర జగన్ చేస్తున్నారని విమర్శించారు.

# మూసీలో రక్తం పారించాలనుకుంటున్నావా..?

-మొదటిపేజీ తరువాయి

పేదల ఇంటికి బుల్డోజర్లు పంపుతారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో హైడ్రా బాధితులతో హరీశ్ రావు సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ.. పేదల ఇండ్లు కూల్చి మూసీపై పెద్ద భవనాలకు అనుమతి ఇస్తామంటున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం బాధితుల వద్దకు వస్తుంద న్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలను ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. సీఎం రేవంత్ అనాలోచిత నిర్ణయాలతో పాలన చేస్తున్నారని విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న అంశంపై దృష్టి సారించాలని హితవు పలికారు. ప్రజలు రోగాలబారిన పడుతున్నప్పుడు వాటిపై దృష్టి పెట్టే ఆలోచన ముఖ్యమంత్రి చేయలేదని విమర్శించారు. హైదరాబాద్ ఖ్యాతిని సీఎం రేవంత్ దెబ్బ తీస్తున్నారని చెప్పారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించిన తర్వాతే మూసీపై ముందుకు వెళ్లాలని డిమాండ్ చేశారు.

కూకటపల్లిలో హైడ్రా బాధితురాలు బుచ్చమ్మది ఆత్మహత్య కాదని, అది రేవంత్ రెడ్డి చేసిన హత్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గురు బిడ్డలకు ఇల్లు కట్టించి పెండ్లిళ్లు చేసిందని, ఆ ఇల్లు కూలగొడితే తన బిడ్డల భవిష్యత్తు ఏం అవుతుందని బాధతో ఆత్మహత్య చేసుకుందని వాపోయారు. మొన్న కూడా ఒక ఆమె ఇల్లు కూలకొట్టే సరికి గుండె పోటుతో చనిపోయిందన్నారు. ఇవన్నీ రేవంత్ రెడ్డి పిచ్చి నిర్ణయాల వల్లే జరుగుతున్నాయన్నారు. రాహుల్ గాంధీ హర్యానా ఎన్నికల ప్రచారంలో బుల్డోజర్ రాజ్ నహీ చలేగా అంటూ ప్రచారం చేస్తున్నాడని, మరి తెలంగాణలో ఏం జరుగుతున్నదని ప్రశ్నించారు. నేడు తెలంగాణలో కూడా బుల్డోజర్ రాజ్యం నడుస్తుందన్నారు. ముందు తెలంగాణకు వచ్చి బుల్డోజర్లు ఆపి ఆ తరువాత బుల్డోజర్ రాజ్ నహీ చలేగా అంటూ ఇక్కడ ప్రచారం చేయాలన్నారు. హైడ్రా బాధితులంతా తమ కుటుంబ సభ్యులని, మీకోసం తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడు తెరిచే వుంటాయన్నారు. ఎప్పుడైనా



రావచ్చని, తాము మీ వెంటే ఉంటామని భరోసానిచ్చారు. బాధితులకు రక్షణ కవచంలా ఉంటామని చెప్పారు. లీగల్ సెల్ బాధితులకు అండగా ఉంటుందని చెప్పారు.

**మూసీలో రక్తం పారించాలనుకుంటున్నావా..?**

**రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ఫైర్**

మూసీ ప్రక్షాళన పేరిట.. నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న నిర్మాణాలను కూల్చేసేందుకు సిద్ధమైన సీఎం రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగావు. మూసీలో నీళ్లు పారించాలి అనుకుంటు న్నావా..? పేదోళ్ల కన్నీళ్లు, రక్తం పారించాలి అనుకుంటు న్నావా..? అని రేవంత్‌పై హరీశ్‌రావు మండిపడ్డారు. గాంధీ ఆస్పత్రి వద్ద హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఈ హైడ్రా వేధింపులు భరించలేక.. ఆందోళనతో బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకున్నారు. ఇప్పటికే 3 ఆత్మహత్యలు జరిగాయి. ఇంకా ఎంత మందిని చంపదలచుకున్నావు. బుచ్చమ్మది ఆత్మహత్య కాదు.. ఇది రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య. నీ యొక్క తప్పిదాలు, చర్యల వల్ల పేదోళ్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దేని కోసం మూసీ సుందరీకరణ చేస్తున్నవ్. ఎంత మందిని పొట్టన పెట్టుకోదలుచుకున్నావ్.. ఈ రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయి.. వాటిని షరిష్కరించు అని హరీశ్‌రావు సూచించారు. గాంధీ ఆస్పత్రిలోని ప్రయివేటు మెడికల్ షాపుల వద్ద లైన్లలో నిలబడి మందులు కొంటున్నారు. ఆస్పత్రిలో ఉచితంగా ఇచ్చే పారాసిటామల్, గ్యాస్ సమస్యకు వాడే మందుల్లేక విలవిలలాడిపోతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను నిర్వీర్యం చేశారు రేవంత్ రెడ్డి. రెసిడెన్షియల్ హాస్టల్‌లో పిల్లలు అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. వ్యాధులతో లక్షలాది మంది బాధపడుతున్నారు. ఆ పనుల మీద రివ్యూ చేయమంటే కూల్చే పనిమీద పడ్డడు. నీవు కట్టే పని చేయ్.. హైదరాబాద్‌ను నిలబెట్టే పయత్నం చేయ్. ఈ పిచ్చి ప్రయత్నాలు మానుకో.. కూల్చివేతలు మానుకో.. పేద ప్రజల ఉసురు పోసుకోవద్దని హెచ్చరిస్తున్నాం అని హరీశ్‌రావు తేల్చిచెప్పారు.

# యాదాద్రి ప్లాంట్‌లో వరుస దొంగతనాలు

**నల్గొండ :** నల్గొండ జిల్లాలో కడుతున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వరుసగా చోరీలు జరుగుతున్నాయి. కోట్ల విలువైన మెటీరియల్ పక్కదారి పడుతోంది. నిర్మాణ పనుల కోసం..విలువైన ఐరన్, అల్యూమినియం, రాగి ఇతర సామాగ్రి వేల టన్నుల మెటీరియల్ వాడుతున్నారు. వివిధ ప్రాంతాలు, దేశాల నుంచి సామాగ్రిని తెప్పించి ప్లాంట్ దగ్గరలో నిల్వ చేస్తున్నారు. ఆ మెటీరియల్ భద్రత కోసం వాచ్ టవర్లు ఏర్పాటు చేశారు. గతేడాది నుంచి స్థానిక పోలీసులను కాదని.. భద్రతను ాఖఈకు అప్పగించారు. పర్యవేక్షణ చేసేందుకు ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐ స్థాయి అధికారులు, 40 మంది సిబ్బందిని ఉంటున్నారు.ఇంత టైట్ సెక్యూరిటీ ఉన్నా..యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోకి వెళ్లాలంటే అంత ఈజీ కాదు. ఎవర్నీ కూడా ప్రధాన గేటు లోపలికి కూడా అనుమతించరు. లోపలికి వచ్చేవారి..వెళ్లేవారి వివరాలు అన్ని రికార్డవుతాయి. మీడియాను కూడా గేట్ దగ్గరే ఆపివేస్తారు. ఇంత కట్టుదిట్టమైన భద్రత ఉన్నా..కోట్ల విలువ చేసే మెటీరియల్ చోరీకి గురవడం చర్చనీయాంశంగా మారింది.కొందరు ప్లాంట్ సిబ్బంది సహకారంతో అక్రమార్కులు ముఠాగా ఏర్పడి విలువైన సామగ్రిని తరలిస్తూ కోట్ల రూపాయలను జేబుల్లో నింపుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మే నెలలో విలువైన అల్యూమినియం షీట్లను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆ కేసుకు సంబంధించి 11 మందిని అరెస్ట్ చేశారు. దాదాపు 6 కోట్ల విలువైన సామాగ్రిని పక్కదారి పట్టించినట్లు అంచనా వేశారు. వారి నుంచి 71 లక్షల మెటీరియల్, 20 లక్షల విలువైన కారు, ఆటో, 58 లక్షల నగదుతో కలిపి మొత్తం 1.49 కోట్ల రూపాయల సొత్తును స్వాధీనం చేసుకున్నారు.లేటెస్ట్‌గా ప్లాంట్‌లో మళ్ళీ మెటీరియల్ చోరీ జరిగింది. ప్లాంట్ నుంచి ఐరన్, అల్యూమినియం, ఇతర



మెటీరియల్‌ను చోరీ చేసి తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు యువకులు ముఠాగా ఏర్పడి యాదాద్రి పవర్ ప్లాంట్ నుంచి ఐరన్, అల్యూమినియం, ఇతర విలువైన మెటీరియల్‌ను తరలిస్తున్నట్లు చెబుతున్నారు.థర్మల్ పవర్ ప్లాంట్ పనులను దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థల ఉద్యోగులు, కొందరు ఇంజనీర్లు..దొంగల ముఠాతో కుమ్మక్కై ఐరన్, అల్యూమినియం చోరీ చేసి..ఐరన్ స్క్రాప్ వ్యాపారులకు అమ్ముతున్నట్లు పోలీస్ విచారణలో తేలింది. మిర్యాలగూడలోని ఓ ఐరన్ స్క్రాప్ షాప్ యజమాని యాదాద్రి పవర్ ప్లాంట్ నుంచి చోరీ చేసిన మెటీరియల్ కొంటున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఆ దొంగల ముఠాతో పాటు మెటీరియల్ కొంటున్న వ్యాపారులను పోలీసులు అరెస్ట్ చేశారు.ప్లాంట్ నుంచి రెండేళ్లుగా అల్యూమినియం, బ్రాస్, జిఐ బండిల్స్ సహా ఇతర మెటీరియల్ చోరీ అవుతోంది. ప్లాంట్‌లోని ఇంజనీర్లు, కాంట్రాక్ట్ సంస్థల ఉద్యోగులు.. అక్రమార్కులతో కలిసి మెటీరియల్ చోరీకి సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 2023 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు పలుమార్లు మెటీరియల్ దొంగతనం జరిగినట్లు ఃఊఇఒ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నడుమ ఉన్న స్టోర్ యార్డ్ నుంచి భారీ స్థాయిలో మెటీరియల్ పక్కదారి పడుతుంటే అధికారులు, సిబ్బంది గుర్తించలేకపోవడం ఏంటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీని వెనక పలువురు అధికారులతో పాటు భద్రతా సిబ్బంది పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే దొంగిలించిన మెటీరియల్ అమ్మేయగా వచ్చిన డబ్బులతోనే అందరినీ మేనేజ్ చేసి తప్పించుకున్నారట.అందుకే అసలు నిందితులను వదిలేసి కేవలం మెటిరియల్ తరలిస్తున్న వారిని.. కొనుగోలు చేసేవారు మాత్రమే అరెస్ట్ అవుతున్నారన్న చర్చ జరుగుతోంది. ప్లాంట్ నుంచి ఇప్పటికే దాదాపు 7 కోట్ల విలువైన మెటీరియల్ మాయమైనట్లు అధికారిక ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు చెబుతున్నారు. కానీ చోరీ అయిన మెటీరియల్ విలువ 20 కోట్ల నుంచి 30 కోట్లకుపైగా ఉంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ దందాపై సమగ్ర దర్యాప్తు చేసి అసలు గుట్టు విప్పాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇంటి దొంగను ఈశ్వరుడైన పట్టలేడన్న సామెత తెలిసిందే. ఇప్పుడా ఇంటి దొంగను కనిపెట్టే పనిలో పడ్డారు అధికారులు. మరోవైపు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో మెటీరియల్ పక్కదారి పట్టడంపై రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక పెట్టినట్లు తెలుస్తోంది.

## ఫ్యామిలీ కార్డులో యజమానిగా మహిళ

-మొదటిపేజీ తరువాయి

బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డు వంటి సమాచారం సేకరించాల్సిన అవసరం లేదన్నారు. కాగా, ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం ఇటీవలే రాజస్థాన్, హరియాణా, కర్ణాటక, మహారాష్ట్రలో పర్యటించింది. ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలపై ఈ సందర్భంగా అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం డిజిటల్ కార్డుల రూపకల్పనపై అధికారులకు సీఎం పలు ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. కార్డుల్లో పొందుపరచాల్సిన వివరాలను నివేదిక రూపంలో ఆదివారం సాయంత్రంలోగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహతో కూడిన మంత్రివర్గ ఉపసంఘానికి అందజేయాలని ఆదేశించారు. ఉపసంఘం సూచనల మేరకు అందులో జత చేయాల్సిన, తొలగించాల్సిన అంశాలతో సమగ్ర జాబితా రూపొందించాలన్నారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలన..**

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల అమలుకు రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలోనూ రెండు ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఒక గ్రామీణ, ఒక పట్టణ ప్రాంతాన్ని ఎంపిక చేయాలని, పూర్తిగా గ్రామీణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లోనైతే రెండు గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పూర్తిగా నగర, పట్టణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లో రెండు వార్డులు, డివిజన్లను ఎంపిక చేయాలన్నారు. కుటుంబాల నిర్ధారణ, డిజిటల్ కార్డుల వివరాలకు సంబంధించి అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయించాలని అధికారులను ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో అక్టోబరు 3నుంచి ఈ పరిశీలన చేయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నియోజకవర్గానికీ ఆర్డీవో స్థాయి అధికారిని పర్యవేక్షణకు నియమించాలని సూచించారు. నగర, పట్టణ ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ స్థాయి అధికారిని నియమించాలన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన కచ్చితత్వంతో చేపట్టాలని, ఎటువంటి లోపాలకు తావులేకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జనతా గ్యారేజీని తలపిస్తున్న బీఆర్ఎస్ ఆఫీస్

-మొదటిపేజీ తరువాయి

పెద్దలను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇలా హైడ్రా బాధితుల కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వివిధ మార్గాల్లో వారంతా బీఆర్ఎస్‌కు ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు. సోషల్ మీడియా, ఫోన్, మెయిల్స్‌తోపాటు నేరుగా వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. పక్కా అనుమతులతోనే కట్టించుకున్న భవనాలను ఎలా కూలుస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇలాంటి వారికి బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. తెలంగాణ భవన్ గేట్లు ఎప్పుడూ తెరిచే ఉంటాయని వాళ్లు వచ్చి తమ సమస్యలు చెప్పుకోవచ్చని పిలుపునిచ్చారు. కేటీఆర్ సహా బీఆర్ఎస్ నేతల పిలుపుతో హైడ్రా బాధితులంతా తెలంగాణ భవన్‌కు క్యూ కట్టారు. ఈ ఉదయం ఏడు గంటల నుంచే ప్రజలంతా అక్కడకు చేరుకున్నారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, హరీష్‌రావు సహా ఇతర ముఖ్య నేతలంతా బాధితులతో మాట్లాడుతున్నారు. వారికి అండగా ఉంటామని చెబుతున్నారు. జ్వరంతో బాధపడుతున్న కేటీఆర్ రావడం లేదని బాధితులకు నేతలు వివరిస్తున్నారు. తనకు ఫీవర్ ఉన్న విషయాన్ని మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఎఫ్ టీఎల్, బఫర్‌జోన్ పేరుతో నోటీసులు ఇవ్వకుండానే హైడ్రా తమ ఇళ్లను కట్టడాలను కూల్చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. మరోవైపు నుంచి ఆపరేషన్ మూసీ పేరుతో అధికారులు మార్కింగ్ చేస్తున్న విషయాన్ని నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఓవైపు నుంచి హైడ్రా, మరోవైపు ఆపరేషన్ మూసితో తీవ్ర ఒత్తిడికి గురి అవుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళన తమలో ఉందని చెప్పుకున్నారు. రాత్రి పూట నిద్ర పట్టడం లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు.ఇప్పుడు కట్టిన ఇళ్లకు ప్రభుత్వమే అనుమతులు ఇచ్చిందని.. విద్యుత్ బిల్లులు కూడా అధికారులు వసూలు చేస్తున్నారని గుర్తు చేశారు. టాక్స్ కూడా కడుతున్నామని అన్నింటినీ తీసుకున్న తర్వాత అక్రమ కట్టడాలు ఎలా అవుతాయన్నారు. బాధితులు . బ్యాంకులు లోన్ కూడా ఇచ్చాయని వివరించారు. అధికారికంగా ఇన్న ఉన్నవాటిని అక్రమ కట్టడాలు అని ఎలా అంటారని ప్రశ్నిస్తున్నారు.

## హైడ్రా అంటే భరోసా, బాధ్యత

-మొదటిపేజీ తరువాయి

దాని పక్కన ఉన్న గుడిసెలను కూల్చలేదు. ప్రజలు నివసిస్తున్న భవనాలను అసలు కూల్చలేదు. ఇటీవల కూకట్‌పల్లి నల్ల చెరువులో ఆక్రమణలను కూల్చేశాం. ముందస్తు సమాచారం ఇచ్చినా కొందరు ఖాళీ చేయలేదు. అక్రమ కట్టడాలను మాత్రమే కూల్చివేశాం అని రంగనాథ్ పేర్కొన్నారు. అమీన్‌పూర్‌లో ప్రభుత్వం భూములు పెద్ద ఎత్తున అన్యాక్రాంతం అయ్యాయి. అమీన్‌పూర్‌లో గతంలో ఓ హాస్పిటల్‌ను కూల్చినా మళ్లీ నిర్మించారు. అమీన్‌పూర్‌లో హాస్పిటల్‌ను కూల్చేశారని ప్రచారం చేస్తున్నారు. అమీన్‌పూర్‌లో కూల్చిన ఆస్పత్రిలో రోగులెవరూ లేరు.. వీడియో రికార్డు కూడా చేశాం అని పేర్కొన్నారు. హైడ్రా మీద భయంతో బుచ్చమ్మ అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసి చాలా బాధపడ్డాను. బుచ్చమ్మను కొందరు భయపెట్టారు. హైడ్రా అంటే భరోసా, బాధ్యత.. దీనిని బూచిగా చూపించొద్దు. సరైన సమయం ఇచ్చిన తర్వాతే ఆక్రమణలు కూల్చివేస్తున్నాం. ఇప్పుడు కాకపోతే, ఇంకెప్పుడు చెరువులు, నాళాలను కాపాడుకోలేం అని రంగనాథ్ తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణం అనేది రాజ్యాంగంలో భాగం. పరిశుభ్రమైన వాతావరణం జీవించే హక్కులో భాగం. ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని రాజ్యాంగంలో పేర్కొన్నారు. పేదలకు ఇబ్బంది చేయాలనేది హైడ్రా అభిమతం కాదు. అసదుద్దీన్ ఓవైసీ, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డికి చెందిన కాలేజీలపై ఫిర్యాదులు వచ్చాయి. విద్యా సంవత్సరం నష్టపోతుందనే వాటిపై చర్యలు తీసుకోలేదు. అక్రమ కట్టడాలపై వెనుక పెద్దవాళ్లు ఉన్నారని రంగనాథ్ పేర్కొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి కోదండరాం సహా విద్యావేత్తల బహిరంగ లేఖ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ జనసమితి అధినేత, ఎమ్మెల్సీ కోదండరాం సహా పలువురు విద్యావేత్తలు బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన భూమిని జవహర్ లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు నామమాత్రపు ఫీజుతో ఉన్నత చదువులు అందిస్తున్న ఏకైక విశ్వవిద్యాలయం అంబేద్కర్ యూనివర్సిటీ అని, కాబట్టి ఆ వర్సిటీ భూమిని ఇతర యూనివర్సిటీలకు కేటాయించవద్దని కోరారు. అంబేద్కర్ యూనివర్సిటీని నిలబెట్టుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. రేవంత్ రెడ్డికి లేఖ రాసిన వారిలో ఎమ్మెల్సీ కోదండరాం, హరగోపాల్, ఘంటా చక్రపాణి, దొంతి నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

## బతుకమ్మ నుంచి కవిత రీ ఎంట్రీ...

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ బాస్ కేసీఆర్ బిడ్డ, ఎమ్మెల్సీ కవిత రాజకీయ అడుగులపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టై బెయిల్‌పై బయటకు వచ్చిన కవిత? ఇప్పటివరకు రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. తన అరెస్టుకు ముందు రాష్ట్ర రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్న కవిత? బెయిల్ వచ్చి సుమారు నెల రోజులు అవుతున్నా సైలెంట్‌గా ఉండటం పట్ల ఆమె అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆమె గతంలో ప్రాతినిధ్యం వహించిన నిజామాబాద్‌లోనూ ఇప్పటివరకు అడుగు పెట్టలేదు. ఐతే, రాజకీయ ప్రత్యర్థులు మాత్రం కవితను రెచ్చగొట్టేలా విమర్శల దాడి చేస్తున్నారు. దీంతో విశ్రాంతికి సెలవు ప్రకటించి తనపై రాజకీయ విమర్శలకు దీటుగా సమాధానం చెప్పాలని డిసైడ్ అయ్యారట కవిత. అందుకే తన రీ ఎంట్రీ గ్రాండ్‌గా ఉండేలా ప్లాన్ చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇందుకోసం తన బ్రాండ్ బతుకమ్మను వేదికగా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.ఉద్యమ కాలం నుంచి బతుకమ్మ సంబరాలతో తనకో బ్రాండ్ సంపాదించుకున్నారు కవిత. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలకు ప్రాచుర్యం తీసుకువచ్చారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడి మతోన్మాదాన్ని తరిమికొడదాం

**దేవనకొండ, శుభ తెలంగాణ :** భగత్ సింగ్117వ జయంతి కార్యక్రమాన్ని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి కే. శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. డివైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి చిన్న వీరేంద్ర నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమాలను ఉద్దేశించి డివైఎఫ్ఐ మండల కార్యదర్శి కే.శ్రీనివాసులు నాగరాజు మాట్లాడుతూ 1907 సెప్టెంబర్ 28వ తేదీ లాయల్పూర్ జిల్లా బంగా గ్రామంలో జన్మించిన భగత్ సింగ్ లాల లజపతిరాయి మహాత్మా గాంధీ పిలుపులను అందుకొని భారత స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు తెలిపారు. ఏడు సంవత్సరాల వయసులో గద్దర్ వీరుడైన కత్తర్ సింగ్ ని బ్రిటిష్ పోలీసులు అరెస్టు చేస్తే వాళ్ల చిన్నమ్మకు ధైర్యం చెప్పాడని తెలిపారు. తమ పెరట్లో తుపాకులు నార్తే అవి పెరిగి భారీగా తుపాకులు కాస్తాయి వాటి ద్వారా బ్రిటీష్ సామ్రాజ్యవాదులను తరిమి కొట్టొచ్చు కదా అని తన తండ్రికి తెలిపిన వ్యక్తి అని అన్నారు. లాలజపతిరాయ్ పై బ్రిటిష్ ప్రభుత్వం కాల్పులు జరిపితే ప్రతి చర్యగా సాండర్స్ అనే పోలీసును కాల్చి చంపారని ఆ తర్వాత భగత్ సింగ్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక విప్లవ పోరాటాలను గ్రంథాలను అధ్యయనం చేసి టెర్రరిజం నుండి మార్క్సిజం వైపుకు, ఆస్తికము నుండి నాస్తికం వైపుకు మారారని తెలిపారు. భగత్ సింగ్ నౌజవాన్ భారత్ సభ, హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికం ఆర్మీ అసోసియన్ పేరుతో ఆనాటి విద్యార్థును యువకులను స్వతంత్ర పోరాటంలో పాల్గొనేలా చేశారని తెలిపారు. స్వతంత్ర పోరాటానికి తూట్లు పొడిసే విధంగా లాలాలజపతిరాయ్ ఇందు మహాసభకు వెళ్లడంతో మహమ్మద్ అలీ జిన్నా ముస్లిం లీగ్ తో పనిచేయడం వల్ల తీవ్రంగా వ్యతిరేకించిన వ్యక్తి భగత్సింగ్ అని తెలిపారు. నాన్న క్షమాభిక్ష కోరమంటే సున్నితంగా తిరస్కరించి తండ్రిగా జన్మ ఇవ్వడం వరకే నీ హక్కు ఎలా బ్రతకాలి ఎలా చనిపోవాలని నా ఇష్టమని తెలిపిన వ్యక్తి భగత్ సింగ్ అని తెలిపారు. నేడు భగత్ సింగ్ కోరుకున్న సమ సమాజం కాకుండా మతోన్మాద రాజ్యం రావడం ఇలాంటి తరుణంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఉత్తరప్రదేశ్లో మతోన్మాదం తెచ్చరిల్లి మూఢత్వం పెరిగిపోయి రెండు సంవత్సరాల విద్యార్థిని ఉపాధ్యాయులే నరబలి ఇవ్వడం సమాజానికి సిగ్గుచేటని ఈ సందర్భంగా తెలిపారు. ఈ తరుణంలో యువకులు విద్యార్థులు శాస్త్రీయ విద్యా విధానం కోసం, శాస్త్రీయబద్ధంగా బ్రతకడం కోసం మతఉన్మాదానికి, మూఢత్వానికి వ్యతిరేకంగా పోరాడినప్పుడే భగత్ సింగ్ కి నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు నాని, వీరప్ప,చిన్న, రంగస్వామి, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



## హైడ్రాపై మండిపడ్డ విపక్ష నేతలు

**కూకట్ పల్లి :** కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మాధవరం కాంతారావు హైడ్రా కమిషనర్ రంగనాథ పైన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసారతు. కూకట్ పల్లి యాదవ బస్తీలో నిన్న రాత్రి ఆత్మహత్య చేసుకున్న బుచ్చమ్మ మృతికి హైడ్రా నిరంకుశ పోకడలే కారణం మాధవరం కృష్ణారావు అన్నారు. హైడ్రా పై దమ్ముంటే అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. శనివారం ఆదివారం వచ్చింది అంటే నగర ప్రజలు భయ భ్రాంతులకు గురయ్యే పరిస్థితిని తీసుకువచ్చారనీ అన్నారు. హైడ్రా ఎవరికీ చెప్పకుంగా డైరక్ట్ గా .ఈహెచ్ఎంసి, పోలీసులను తీసుకువచ్చి ఇళ్లను కూలుస్తూ ప్రజల ఉసురు తీసుకుంటున్నారనీ నేతలు తీవ్రంగా విమర్శించారు.

## అడ్డదారిలో బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీ

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** తెలంగాణలో మళ్ళీ అడ్డదారిలో బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీ ప్రయత్నం చేస్తున్నారని తెలంగాణ నిరుద్యోగ రక్షణ జెఏసి ఛైర్మన్ డా. మహిపాల్ యాదవ్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో డా.మహిపాల్ యాదవ్ మాట్లాడుతూ.... గత ప్రభుత్వంలో అడ్డదారుల్లో బ్యాక్ లాగ్ ఉద్యోగాలు భర్తీ చేసి అనేక తప్పిదాలు చేశారని, ఆ బాటలోనే ఈ ప్రభుత్వంలో ఉన్న కొంత మంది అధికారులు వారం రోజుల్లో మళ్లీ అడ్డదారుల్లో గుట్టుచప్పుడు కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని మున్సిపల్ ఇరిగేషన్ రెవెన్యూ తదితర శాఖలో బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీకి సిద్ధపడుతున్నట్టు డా. మహిపాల్ యాదవ్ ఆరోపించారు.గతంలో అడ్డదారిలో బ్యాక్ లాగ్ ఉద్యోగాల ద్వారా నియమించబడ్డ వాళ్లని తొలగించాలని,అలా అక్రమంగా నియమించిన వాళ్లను కఠినంగా శిక్షించాలన్నారు.అర్హులైన వారిని మాత్రమే బ్యాక్ లాగ్ ఉద్యోగాలలో నియమించాలి.తమ ప్రధాన డిమాండ్ కూడా ఇదేనని ప్రభుత్వం వారం రోజుల్లో మళ్లీ అడ్డదారుల్లో బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీ చేయాలనుకుంటున్న అధికారు లను గుర్తించి వారిని అడ్డుకోవాలి, హెచ్చరించాలి. అడ్డదారుల్లో బ్యాక్ లాగ్ ఉద్యోగం కొనాలి అనుకునే వారికి మీ డబ్బులు పోతాయి, మీ జాబులు పోతాయి, మీరు జైలుకు వెళ్తారని ప్రభుత్వం గట్టిగా హెచ్చరికలు జారీ చేయాలని మహిపాల్ యాదవ్ పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో కూడా అడ్డదారిలో నిర్మల్ మున్సిపల్ లో ఏకంగా 44 పోస్టులు భర్తీ చేశారని, కొన్నిటిని బంధుప్రీతితో, కొన్నిటిని వేలం వేసి అమ్ముకున్నారని, ఒక్కో జాబుకు 16 లక్షలకు వసూలు చేసినట్టు డాక్టర్ మహిపాల్ యాదవ్ ఆరోపించారు. గతంలో కెసిఆర్ సామాజిక వర్గానికి సంబంధించిన ఒక మహిళ కు తెలంగాణ జెన్ కో లో ఏఈ ఎగ్జామ్ రాయకుండానే ఆమెకు ఏఈ పోస్ట్ ను ఇచ్చిన సంగతిని ఆయన గుర్తు చేశారు.

# రిజిస్ట్రేషన్ శాఖలో అక్రమ నియామకాలు

**దరఖాస్తులు స్వీకరించకుండానే ఎంపిక ప్రక్రియ**

**నిరుద్యోగుల ఆశలపై నీళ్లు.**

**నిలుపుదల చేయాలని ప్రజాసంఘాల డిమాండ్**

**వరంగల్, శుభ తెలంగాణ :** తమరిని అడిగేవారు ఎవరు అన్న ధీమానో ఏమోగానీ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రిజిస్ట్రేషన్ శాఖలో అక్రమ నియామకాల ప్రక్రియ జోరుగా కొనసాగుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 15 సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ఉన్నాయి. వాటిలోని ఖాళీలను ప్రభుత్వం ఔట్సోర్సింగ్ విధానంలో భర్తీ ప్రక్రియను గతంలో చేపట్టి భర్తీ చేసింది. ఆ క్రమంలో వరంగల్ పోర్ట్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఖాళీ ఉందన్న కారణంతో ఓ వ్యక్తిని ఔట్సోర్సింగ్ విధానం ద్వారా అప్పట్లో భర్తీ చేసింది. అతను అనారోగ్య కారణాలతో కార్యాలయంకు వెళ్లకపోవటంతో దాన్ని సాకుగా తీసుకున్న స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఎలాంటి ప్రకటన చేయకుండా ఆ ఖాళీని భర్తీ చేయడం పై అనేక అనుమానాలు వినిపిస్తున్నాయి. ఖాళీల భర్తీపై ప్రకటన చేసినట్లయితే వాటిని ప్రజలకు చూపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రెండు నెలల క్రితం ఆ ఖాళీని స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ భర్తీ



చేసింది. జిల్లాలో ఎంతోమంది నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ఖాళీగా ఉంటున్న పరిస్థితుల్లో స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఖాళీల భర్తీ కోసం ప్రకటన చేయకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ పోర్టు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో భర్తీ చేసిన ఆ వ్యక్తికి ఉన్న అర్హతలు తమకు లేవా అంటూ అధికారుల తీరుపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఈ నియామకం వెనుక రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల హస్తం ఉందని నిరుద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఆ భర్తీ వెనుక జరిగిన తతంగం ఏమిటని ప్రజలు అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ పోర్ట్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఉన్న ఖాళీని భర్తీ చేయడం కోసం చేపట్టినప్పటికీ అతను వరంగల్ రూరల్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేయడంపై ప్రజల అనుమానాలకు బలం చేయకపోయినట్లు అయిందని నిరుద్యోగులు అంటున్నారు. వరంగల్ పోర్టు కార్యాలయంలో గతంలో పనిచేసిన వ్యక్తికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఈ ప్రక్రియ చేపట్టినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో ఇటీవల భర్తీ చేసిన అక్రమ ఉద్యోగ నియామకాలను నిలుపుదల చేయాలని నిరుద్యోగులు ప్రజలు ప్రజాసంఘాల నాయకులు అధికారులను ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేయాల్సిన వారు సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో జూనియర్ అసిస్టెంట్ స్థాయి వరకు విధులు నిర్వహించడం పై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఔట్సోర్సింగ్ విధానం ద్వారా పనిచేసిన ఉద్యోగులు కార్యాలయంలో అనేక అవినీతి అక్రమ కార్యక్రమాలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి.ఐనా అధికారులు వాటిని విస్మరించి కార్యాలయంలో వారికి స్థాయిని మించిన పనులు అప్పగించడంపై ఉద్యోగుల్లో అసంతృప్తి నెలకొంది.

# ప్రధాని జన్మదినం వేళ ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం

**పెద్దపల్లి, శుభ తెలంగాణ :** ప్రధాని నరేంద్ర మోడి జన్మదిన సందర్భంగా సేవ పక్వాడ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర శాఖ, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారి సౌజన్యంతో రక్తదాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మాట్లాడుతూ సేవ కార్యక్రమంలో భాగంగా మోడీ జన్మదినం పురస్కరిం చుకుని సేవా పక్వాడా లో భాగంగా భారతదేశమంతా బిజెపి జాతీయ పార్టీ పిలుపు మేరకు అన్ని రాష్ట్రాలలో అసెంబ్లి నియోజకవర్గ స్థాయిలో యువమోర్చా, బిజెపి అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు. అలాగే మన రాష్ట్రంలో కూడా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారన్నారు. అలాగే చాలామంది బయటికి వచ్చి రక్తదానం చేయకపోవడం వల్ల తలసేమియా, ప్రసవ సమయం, గుండె సంబంధిత వ్యాధుల వారికి, ప్రమాదాల సమయంలో అధిక రక్తస్రావం జరిగే పేషెంట్లకి సరైన



సమయానికి రక్తం లభించక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన చెందారు. అలా బాధపడే వారికి ఈవిధంగా చేసినటువంటి రక్త దానాల ద్వారా రోగులకు మేలు చేసిన వరమవుతామన్నారు. ఈ కార్యక్రమం లో రామగుండం ఇంచార్జి కందుల సంధ్యారాణి ముదిరాజ్ తంగెడ రాజేశ్వర్ రావు, క్యాతం వెంకటరమణ, పోల్సాని సంపత్ రావు, ఒల్లె తిరుపతి, కారంగుల శ్రీనివాస్, కోదాటి రమణారావు, ఎర్రోళ్ల శ్రీకాంత్ ముంజ రాజేంద్ర ప్రసాద్, వే ల్పుల రమేష్, పూదరి హరీష్ పటేల్, వినయ్, గాదాసి సతీష్, హరీష్, అంజి, పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## కోర్టులో స్వచ్ఛభారత్

**పరిసరాలను శుభ్రం చేసిన జూనియర్ సివిల్ జడ్జి**



**వేములవాడ :** స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం వేములవాడ కోర్టు పరిసరాలను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి కిరణ్మయి న్యాయవాదులు కోర్టు సిబ్బందితో కలిసి కోర్టు పరిసరాలను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఎలాంటి వ్యాధులు రావని,కోర్టుకు ఎంతో మంది కేసుల నిమిత్తం రావడం జరుగుతుందని,వారు కోర్టు పరిసరాల్లోకి రావడంతోనే మంచి వాతావరణం కనిపించాలని చెత్తాచెదారాన్ని తొలగించడం జరిగిందని అన్నారు.

**మెగా లోక్ అదాలత్**

నేషనల్ లోక్ అదాలత్ లో భాగంగా శనివారం వేములవాడ కోర్టులో 539 కేసులు పరిష్కారమయ్యాయని జూనియర్ సివిల్ జడ్జ్ కిరణ్మయి తెలిపారు.100 రాజీ కాబడిన కేసులను,439 పిట్ కేసులను పరిష్కరించడం జరిగిందని,రాజీయే రాజా మార్గమని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం,ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్,ఏపీపీ విక్రాంత్,న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, తిరుమల్ గౌడ్,కిషోర్ రావు,నాగుల సంపత్,బొడ్డు ప్రశాంత్ కుమార్,గొంటి శంకర్, పంపరి శంకరయ్య,రేగుల రాజ్ కుమార్,బొజ్జ నరేష్,నర్సింగరావు శ్రీనివాస్,నయము నాసారి,అన్నపూర్ణ,పావని న్యాయవాదులు ఉన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తులచే భూలక్ష్మి ప్రతిమ తొలగింపు

**జూలపల్లిలో విగ్రహ ప్రతిష్టాపన**



**కమాన్ పూర్, శుభ తెలంగాణ :** కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి భూలక్ష్మి విగ్రహాన్ని ఎట్టుకెళ్లిన గుర్తుతేలియని వ్యక్తులు అక్కడికి కొంత దూరంలో గడ్డి వాము ప్రక్కన చెట్ల పొదల్లో వదిలిపెట్టారు. విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి వచ్చిన ఎస్. ఐ కొట్టె ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చేపట్టాగా చెట్ల పొదల్లో లభించింది. అనంతరం పంబాల వాళ్ళు భూలక్ష్మి విగ్రహాన్ని ప్రత్యేక పూజలా మధ్య పునః ప్రతిష్ట చేశారు. కాగా ఈ దురాగతానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామ నికి చెందిన పలువురు విలేకరుల సమావేశంలో కోరారు. ఈ సమావేశంలో పోల్దాసరి సాయికుమార్ చొప్పరి తిరుపతి బర్ల సదానందం బొమ్మగాని అనిల్ కుమార్ మారబోయిన ముత్యాలు కుమార్ ఇరుగురాళ్ల తిరుపతి చొప్పరి గట్టయ్య ఎలబోయిన రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో నిందితుడు

**ఆసిఫాబాద్, శుభ తెలంగాణ :** ఆసిఫాబాద్ మండలం బూరు గూడ గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న మైనర్ బాలిక (11) పై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. పాఠశాల అనంతరం విద్యార్థులంతా ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఒంటరిగా వెళుతున్న విద్యార్థిని గమనించిన యువకుడు మద్యం మత్తులో బాలికను తన ఇంటికి బలవంతంగా తీసుకెళ్లి ఇంటి లోపల అఘాయిత్యానికి పాల్పడగా అటుగా వెళుతున్న ఇద్దరు వ్యక్తులు గమనించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు నిందితుడిని పోలీస్ స్టేషన్కు తరలించారు. అనంతరం బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుని పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితున్ని ఫోక్సో చట్టం ద్వారా కఠినంగా శిక్షించి ఉరితీయాలని బూరుగూడ జాతీయ రహదారి పై బాధిత కుటుంబ సభ్యులతోపాటు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, గ్రామస్తులంతా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

## ఏసీబీ వలలో విక్టోరియా మెమోరియల్ స్కూల్ ప్రిన్సిపాల్

**హైదరాబాద్ , శుభ తెలంగాణ:** కొత్తపేట లోని విక్టోరియా మెమోరియల్ హోమ్ రెసిడెన్షియల్ స్కూల్ లో ఏసీబీ రైడ్స్ జరిపింది. ఫుడ్ కాంట్రాక్టుకు సంబంధించి 29,000/- రూపాయల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్ వివెం హోమ్ ప్రిన్సిపాల్ ప్రభు దాస్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. స్కూల్ కు సంబంధించిన ఫుడ్ కాంట్రాక్టు విషయం లో అవకతవకల పై పలు ఫిర్యాదులు రావడం తో వివెం హోమ్ స్కూల్ పై నిఘా ఏర్పాటు చేసారు ఏసీబీ అధికారులు. వివెం ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు వివెం హోమ్ లో సోదాలు నిర్వహించారు. ఫుడ్ కాంట్రాక్టు బిల్లు కు సంబంధించి వాస్తవ బిల్లులు కన్న అధిక బిల్లులు సృష్టించి, అధిక మొత్తం బిల్లులకు సంబంధించిన డబ్బులు 29,000/- వేలు కాంట్రాక్టర్ వద్ద నుండి తిరిగి తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా ప్రిన్సిపాల్ ప్రభు దాస్ దొరికిపోయాడు. ప్రభుదాస్ ను అదుపులోకి తీసుకుని సంబంధించిన వివరాల పై ప్రిన్సిపల్ ను ప్రశ్నిస్తున్నారు.

## ఎలక్ట్రికల్ బైకులో మంటలు

**కుత్బుల్లాపూర్, శుభ తెలంగాణ :** సూరారం పోలీస్ స్టేషన్ పరిధి సూరారం చౌరస్తా లో గల ఆదిత్య మెడికల్ షాప్ ముందు ఎలక్ట్రికల్ బైక్ లో మంటలు చెలరేగాయి. దాంతో ఎలెక్ట్రిక్ వాహనం పూర్తిగా దగ్ధమయింది. పక్కనే గల మెడికల్ షాప్ కు కుడా మంటలు అంటుకోవడంతో షాపు ముందు భాగం పాక్షికంగా దగ్ధమయింది. ఈ నేపథ్యంలో రోడ్డుపై ట్రాఫిరక్ స్థంభించింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఫైర్ సిబ్బం?ది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసారు. ఎలక్ట్రిక్ వాహనం బ్యాటరీ ఛార్జ్ చేస్తుండగా మంటలు వచ్చాయిదవ

# మేడారం కోర్టులో లోక్ అదాలత్

**పరిష్కారమైన 358 కేసులు**
**రాజీ పడటమే రాజమార్గం**
**జూనియర్ సివిల్ జడ్జ్ వెంకట సచిన్ రెడ్డి**

**ధర్మారం, , శుభ తెలంగాణ:** ధర్మారం మండలం నంది మేడారంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జి ఎన్.వెంకట సచిన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కక్షిదారులతో మాట్లాడి, రాజీ కుదిర్చి లోక్ అదాలత్ ద్వారా శనివారం 358 కేసులను పరిష్కరించారు. అనంతరం వెంకట సచిన్ రెడ్డి మాట్లాడుతూ.. కోర్టు కేసుల సత్వర పరిష్కారంపై కక్షిదారులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కోర్టు కేసుల్లో రాజీ పడటమే రాజ మార్గమని, తద్వారా ఆర్థిక, మానసిక ఉపశమనం కలుగుతుందని చెప్పారు. లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారం ద్వారా కక్షిదారులకు డబ్బు, సమయం వృధా కాకుండా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మారం ఎస్ఐ శీలం లక్ష్మణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నారా అశోక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి, లోక్




అదాలత్ మెంబర్ ఆకారి రాజేశం, జాయింట్ సెక్రటరీ నూనె సత్యనారాయణ, స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీ, లోక్ అదాలత్ మెంబర్ భీమారపు సంపత్ కుమార్, సీనియర్ ఈసీ మెంబర్ గడ్డం లింగారెడ్డి, న్యాయవాదులు పురాణం సందీప్ కుమార్, బల్ల సరిత, రజిత, నలిగేటి కళ్యాణి, సూపరిండెంట్ కొమురయ్య, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి మరొకరి ప్రాణాన్ని కాపాడండి

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**





కామారెడ్డి , **శుభ తెలంగాణ**
కామారెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం రోజున కలెక్టర్ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యం లో స్వచ్ఛంద రక్త దాన శిభిరం ను కలెక్టర్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇలాంటి శిబిరాలు మరిన్ని నిర్వహించాలని, అత్యవసర సమయంలో రక్తం అందుబాటులో ఉంచాలని అన్నారు. ఆరోగ్యవంతంగా ఉన్న వారు రక్తాన్ని దానం చేయవచ్చుని, రక్తం దానం చేయడం ద్వారా మరొకరి ప్రాణం కాపాడగలిగిన వారమవుతామనీ తెలిపారు. డి.ఆర్. డి. ఎ. ఆధ్వర్యంలో 35 మంది నుండి రక్తాన్ని సేకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సి. పి. ఒ. రాజారాం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, రెడ్ క్రాస్ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఈడి దాడులకు భయపడేది లేదు

**కంచర్ల జీవన్ రెడ్డి**



**ఖమ్మం , శుభ తెలంగాణ** తెలంగాణలో సుపరిపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలపై కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచర్ల జీవన్ రెడ్డి అన్నారు. బీజేపీలో అభద్రతాభావం పెరిగిందనడానికి నేడు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై జరుగుతున్న ఈడి దాడులే నిదర్శనమన్నారు. దేశంలో బీజేపీ పై వ్యతిరేకత వ్యక్తం అవుతున్న వేళ కాంగ్రెస్ నేతలను భయాందోళనకు గురి చేసేందుకే ఐటి, ఈడీ, పోలీసుల దాడులను బిజెపి నేతలు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆత్మీయ బంధువు మంత్రి పొంగులేటి శ్రీనన్న పై ఎన్ని సార్లు దాడులు చేసిన ఆయన్ని, ఆయన అనుచరగణాన్ని, ఆయన వెనకున్న ప్రజాసైన్యాన్ని భయపెట్టలేరని ఆయన అన్నారు. కాళేశ్వరం సహా, అనేక అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా ఉన్న కేసీఆర్ అండ్ కో లపై మోడీ ఈడి ని పంపగలరా అని సవాల్ విసిరారు.

## కులాంతర వివాహం చేసుకున్న వారికీ ప్రోత్సాహక బడ్జెట్ తక్షణమే విడుదల చెయ్యాలి సంఘం

**సంఘం రాష్ట్ర అధ్యక్షులు యేలేటి ఆంజనేయులు**

**మఠంపల్లి , శుభ తెలంగాణ:** సూర్యాపేట జిల్లా మఠంపల్లి లో శనివారం తెలంగాణ కులాంతర వివాహాల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహిం చడం జరిగినది. ఈ సమావేశం లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు యేలేటి ఆంజనేయులు మాట్లాడుతూ 2019 లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంక్షేమ శాఖ కులాంతర వివాహం చేసుకున్న నవ దంపతులకు ఇచ్చే ప్రోత్సాహం 50,000 లను ఐదు రేట్లు పెంచి, 2,50,000 ఇవ్వాలని గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి కొందరికి ఇవ్వడం జరిగినది.మూడు సంవత్సరాల నుండి ప్రతి జిల్లాలో 80 నుండి 100 దరఖాస్తులు ప్రోత్సాహం కొరకు ఎదురు చూస్తున్నాయి. కానీ నేటికీ ఒక్కరికి కూడా ప్రోత్సాహం అందక ఎదురు చూపులు చూస్తూ ప్రతి జంట కార్యాలయాలు చుట్టూ



తిరుగుతున్నారు. ఇప్పటి కి అయినా తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి స్పందించి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులకు బడ్జెట్ రిలీజ్ చేసి కులాంతర వివాహం చేసుకున్న దంపతులని ఆదు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

## రైతు రుణమాఫీ దరఖాస్తుల స్వీకరణలో పాల్గొన్న వ్యవసాయ శాఖ ఏడీఏ సరిత

**ఖమ్మం , శుభ తెలంగాణ** ఖమ్మం రూరల్ మండలం గొల్లపాడు గ్రామంలోని రైతు వేదికలో కొనసాగుతున్న రైతు రుణమాఫీ దరఖాస్తుల స్వీకరణలో డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సరిత పాల్గొన్నట్లు ఖమ్మం రూరల్ మండల వ్యవసాయ శాఖా అధికారి జె ఉమా నాగేష్ తెలిపారు. శనివారం ఖమ్మం రూరల్ మండలం గొల్లపాడు గ్రామంలోని రైతువేదికలో రుణమాఫీలో భాగంగా రేషన్ కార్డు లేని రైతుల కుటుంబ నిర్ధారణ కార్యక్రమానికి డివిజన్ సహాయ వ్యవసాయ సంచా లకులు సరిత హాజరయ్యారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి క్రాప్ లోని వేవర్ యాప్ లో అప్లోడ్ చేయించడం జరిగిం దని తెలిపారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి డివిజన్ సహాయ వ్యవసాయ సంచా లకులు సరిత మాట్లాడుతూ మూడు విడతల్లో రేషన్ కార్డు లేని కారణంగా రుణమాఫీ కానీ రైతు సోదరులు రుణమాఫీ ధ్రువీకరణ పత్రంపై రైతు సంతకం చేసి, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు జతపరిచి కుటుంబ నిర్ధారణ చేయించు కోవాలని కోరా రు.మండలంలోని రేషన్ కార్డు లేని





అర్హులైన ప్రతి రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయించుకుని వంట రుణమాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండలం వ్యవసాయ అధికారి ఉమా నాగేష్ తది తరులు పాల్గొన్నారు.

## ప్రజాక్షేత్రంలో మంత్రి పొంగులేటిని ఎదుర్కోలేకనే ఈడి దాడులు

**కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొర్ర రమేష్ నాయక్**

**ఖమ్మం , శుభ తెలంగాణ** ప్రజాక్షేత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని ఎదుర్కోలేకనే ఈడి రూపంలో మోడీ దాడి చేయించడం సిగ్గుచేటనీ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొర్ర రమేష్ నాయక్ అన్నారు. శనివారం ఆయన వెలుగు నిఘా ప్రతినిధితో మాట్లాడుతూ ప్రజా నాయకుడు, పేదల పక్షపాతి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజాదారణ చూసి నివ్వరపోయిన కేంద్ర పెద్దలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని ప్రజల నుంచి దూరం చేయడం సాధ్యతరం కాదని, మచ్చలేని నాయకుడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అని అన్నారు. గత పది ఏళ్ల నుంచి ఒక్క బిజెపి నాయకుని పై ఈడి దాడులు జరగలేదనన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజానాయకులపై



ఈడి దాడులు చేపించడం, అసత్య ఆరోపణలు చేయడం అలవాటుగా మారిందని అందుకు ఉదాహరణ ఉద్యమ నాయకుడు జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అని అన్నారు. ఎన్ని ఈడి మోడీ దాడులు జరిగినా పొంగులేటి ప్రతిష్టకు భంగం కలగదన్నారు. ఈ అసత్య ఆరోపణల నుంచి కడిగిన ముత్యం వలే పొంగులేటి కాంగ్రెస్ ప్రభుత్వంలో కొనసాగుతారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అవ హేళన చేస్తున్న మోడీ ప్రభు త్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని కొర్ర రమేష్ నాయక్ హెచ్చరించారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ

**ఖమ్మం , శుభ తెలంగాణ** ఖమ్మం రూరల్ మండలం పల్లె గూడెం గ్రామంలోని ఎరువుల దుకాణాలను శనివారం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాల కులు సరిత తనిఖీ నిర్వహిం చారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కులను పరిశీలించారు. రైతులకు ఎరు వులు ఈ పాస్ మిషన్ ద్వారా అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఆధార్ కార్డు ఆధారంగా ఎరువులను విక్రయిం చాలని సూచించారు. దుకాణా ల్లోని నిల్వల రిజిస్టర్లను పరిశీ లించారు. డీలర్లు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల స్టాక్ బోర్డులను రైతులకు కనబడే విధంగా ప్రదర్శించాలని సూచిం చారు. రైతులకు అందుబాటులో ఎరువులతో పాటు పురుగు మందులు ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండల వ్యవసాయ శాఖ అధికారి జె ఉమా నగేష్ తదితరులు పాల్గొన్నారు.





## రెవెన్యూ ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టిన టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ బృందం



**కామారెడ్డి, , శుభ తెలంగాణ:** కామారెడ్డి జిల్లా కేంద్రంలో టీఎన్జీవోస్ కేంద్ర సంఘం పిలుపు మేరకు టీఎన్జీవోస్ ప్రాథమిక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఈరోజు కామారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి అధ్యక్షతన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రెవెన్యూ ఉద్యోగుల ప్రాథమిక సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగినది.. ఇట్టి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ ఉద్యోగులు టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి మరియు జిల్లా కార్యవర్గ సభ్యుల చేతుల మీదుగా టీఎన్జీవోస్ ప్రాథమిక సభ్యత్వమును తీసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నరాల వెంకటరెడ్డి గారితో పాటు.. కల్చరల్ సెక్రటరీ రాజ్ కుమార్, ఈ సి మెంబర్ సాయినాథ్, రెవెన్యూ కార్యాలయల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేదింటికి ఇందిరమ్మ ఇండ్లు

**మాట ఇచ్చాం మాట నిలబెట్టుకుంటాం**
**కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చెన్ను వెంకటరమణ**

**ఖమ్మం , శుభ తెలంగాణ :** ప్రతి పేదింటికి ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా లబ్ధి చేకూరు తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చెన్ను వెంకటరమణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా ప్రతి పేదలకు ఏదో రకంగా సహకారం జరిగిం దన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు హామీల్లో భాగంగా అత్యంత విలువైనది ఇందిరమ్మ ఇళ్ల పథకం అని తెలిపారు. కూసుమంచి మండలంలోని ప్రతి గ్రామం లో ఇందిరమ్మ ఇండ్లు కమిటీల ద్వారా ఎలాంటి అన్యాయాలు జరగ కుండా, పేదలకు లబ్ధి చేకూరే విధంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా సంపూర్ణంగా కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ఏర్పా టుకు సంబంధించి ఒక్కటి రెండు రోజుల్లో విధివిధానాలు రూపొం దించాలని సూచించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అర్హులైన లబ్దిదారులకు ఇంది రమ్మ ఇళ్లు దక్కాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అనడం అభినందనీయ మన్నారు.



## పౌష్టిక ఆహారాన్ని అందించాలి

**నార్నూర్ , శుభ తెలంగాణ** విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని ఎన్ఫోర్స్మెంట్ డిటి మధుసూ దన్ అన్నారు. శనివారం ఆయన మండలం లో పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని తాడిహడప్నూర్ మరియు జామడలోని ఆశ్రమ హైస్కూల్ లను సందర్శించారు. భోజనశాలను పరిశీలిం చారు. నాణ్యమైన విద్యతో పాటు ఆహారం కూడా అవసరమని అన్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు. హెడ్ మాస్టర్ వందన ఉన్నారు.



## తుది దశ ఓటర్ల జాబితా విడుదల

**నార్నూర్ , శుభ తెలంగాణ** తుది దశ ఓటర్ల జాబితాను మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ కుమ్ర మూతిరాం శనివారం విడుదల చేశారు. మొదటి దశలో ఓటర్ల జాబితాను గతంలో విడుదల చేసి అభిప్రాయాలు సేకరించామన్నారు. సవరణలు చేసిన తుది జాబితాను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఓటర్లు



# ఈ వెజిటబుల్ జ్యూస్‌లో చక్కెర కలిపి రాసుకుంటే..!




చేదు అనేక ప్రయోజనకరమైన లక్షణాలను కలిగి ఉంటుంది.. కాకరకాయ రసం మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా చర్మం, జుట్టు సమస్యలను కూడా నయం చేయడంలో సహాయపడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ చేదు రుచిగల కూరగాయను ఆయుర్వేదంలో అనేక సంవత్సరాలుగా ఔషధంగా ఉపయోగిస్తున్నారు. అయితే ఇది ఆరోగ్యంతో పాటు జుట్టుకు కూడా ఎంతో మేలు చేస్తుందని తెలిస్తే ఆశ్చర్యపోతారు. పొడిబారిన జుట్టు సమస్యకు కూడా కాకర మంచి మందుగా పనిచేస్తుంది. ఇందుకోసం కాకరకాయ రసం మీ జుట్టును అనేక సమస్యల నుండి రక్షిస్తుంది. ఇందులో విటమిన్ బి1, బి2, బి3 మరియు సి, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, ఫోలేట్, ఫాస్పరస్, జింక్, మాంగనీస్ వంటి పోషకాలు ఉన్నాయి. ఇవి జుట్టు పెరుగుదలకు చాలా ముఖ్యమైనవి. జుట్టు రాలే సమస్యకు కాకర రసం ఔషధంగా పనిచేస్తుంది.అరకప్పు కాకర రసాన్ని తీసుకొని, అందులో చెంచా కొబ్బరి నూనె కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు, మాడుకు పట్టించి 5 నుంచి 10 నిమిషాల పాటు మసాజ్ చేసుకోవాలి. 40నిమిషాల పాటు ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా వారంలో రెండుసార్లు అప్లై చేస్తే జుట్టు రాలే సమస్య అదుపులోకి వస్తుందని అంటున్నారు.వెంట్రుకలు నిస్తేజంగా ఉండి, మెరుపు కోల్పోయి ఉంటే, కాకరకాయను రసాన్ని ఉపయోగించవచ్చు. మీకు జుట్టు రాలుతున్నట్లు అనిపిస్తే, కాకరకాయ రసంలో పంచదార కలిపి తలకు పట్టించి, అరగంట తర్వాత కడిగేయండి. తరచూ ఇలా చేస్తూ ఉంటే.. క్రమంగా జుట్టు రాలే సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాదు..ఇది మీ జుట్టు మూలాలను బలపరుస్తుంది. కాకరకాయ ముక్కను తీసుకుని జుట్టు మూలాలపై రుద్దండి. దీని రసాన్ని కూడా ఉపయోగించవచ్చు. ఇలా చేయడం వల్ల చుండ్రు చాలా వరకు తొలగిపోతుంది.జుట్టు పెరుగుదలకు కూడా కాకరకాయ జ్యూస్‌ను ఉపయోగించవచ్చు. కాకరకాయలో ఫోలిక్ యాసిడ్ ఉంటుంది. ఇది జుట్టు పెరుగుదలను మెరుగుపరచడంలో ప్రభావవంతంగా ఉంటుంది. అంతేకాకుండా, కాకరకాయ రసం రక్త ప్రసరణకు సహాయపడుతుంది. తాజా చేదు సొరకాయ రసాన్ని జుట్టుకు రాసుకుంటే కొద్ది రోజుల్లోనే జుట్టు నెరసిపోవడం ఆగిపోతుంది. వారానికి ఒకసారి ఈ చిట్కాలను పాటించండి. కాకర రసం, పెరుగు అరకప్పు చొప్పున తీసుకోవాలి. ఇందులో రెండు చెంచాల నిమ్మరసం యాడ్? చేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో కొంత భాగాన్ని మాడుకు పట్టించి కాసేపు మునివేళ్లతో మృదువుగా మసాజ్? చేయాలి. మిగిలిన భాగాన్ని వెంట్రుకలకు మొత్తం పట్టించి 30 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే క్రమంగా పొడిబారిన జుట్టుకు మంచి నిగారింపును సొంతం చేసుకుంటుంది.

# మహిళల్లో కనిపించే ఈ లక్షణాలు.. క్యాన్సర్‌కు సంకేతాలు కావొచ్చు..




ప్రస్తుతం ప్రపంచాన్ని భయపెడుతోన్న వ్యాధుల్లో క్యాన్సర్ మహమ్మారి ఒకటి. రోజురోజుకీ క్యాన్సర్ బారిన పడుతోన్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మారుతోన్న జీవన విధానం, తీసుకుంటున్న ఆహారంలో మార్పుల కారణంగా క్యాన్సర్ బాధితుల సంఖ్య ఎక్కువుతోంది. అయితే క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే ప్రాణాలు నిలబెట్టుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతుంటారు. శరీరంలో క్యాన్సర్ మొదలైన కొన్ని రోజుల్లోనే కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. శరీరం మనల్ని ముందుగానే అలర్ట్ చేస్తుంది. అయితే ఈ లక్షణాలు మహిళల్లో, పురుషుల్లో వేరువేరుగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా మహిళల్లో క్యాన్సర్ లక్షణాలు ఏవరుగా ఉంటాయి. మహిళల్లో కనిపించే కొన్ని ముందస్తు లక్షణాల గురించి ఇప్పుడుత తెలుసుకుందాం.. మహిళల్లో క్యాన్సర్ ముందస్తు లక్షణాల్లో రక్తస్రావం ప్రధానమైంది. ముఖ్యంగా నెలసరి సమయంలో విపరీతమైన నొప్పి, రక్తస్రావం వంటి లక్షణాలు గర్భాశయ క్యాన్సర్‌కు ముందస్తు లక్షణం కావొచ్చని చెబుతున్నారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి వైద్యుల సూచనలు పాటించడమే ఉత్తమం. శరీరంలో జరిగే కొన్ని మార్పులు కూడా క్యాన్సర్‌కు ముందస్తు లక్షణంగా చెప్పొచ్చు. ముఖ్యంగా మొహంలో కొన్ని ప్రాంతాల్లో ఉబ్బినట్లు కనిపించినా. రొమ్ము ప్రాంతంలో ఉబ్బు కనిపించినా వెంటనే అలర్ట్ అవ్వాలని నిపుణులు చెబుతున్నారు. ఇది కూడా క్యాన్సర్‌కు ముందస్తు లక్షణంగా చెప్పొచ్చు. ఉన్నపలంగా బరువు తగ్గుతున్నా.? లేదా ఉన్నపలంగా బరువు పెరుగుతోన్నా క్యాన్సర్‌కు ముందస్తు లక్షణంగా భావించాలని వైద్యులు చెబుతున్నారు. మహిళలల్లో ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి, సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని నిపుణ అంటున్నారు. దీర్ఘకాలంగా శరీరంలోని కొన్ని ప్రాంతాల్లో నొప్పి ఉంటే వెంటనే అలర్ట్ అవ్వాలని చెబుతున్నారు. ముఖ్యంగా రొమ్ము, కడుపు, పొత్తికడుపులో తీవ్రమైన నొప్పి ఉంటే వైద్యులను సంప్రదించి.. పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు అంటున్నారు. చర్మ రంగులో మార్పు కనిపించినా, ముడతలు వచ్చినా వైద్యులను సంప్రదించాలి. ఎలాంటి కారణం లేకుండా ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. జీర్ణ సంబంధిత సమస్యలను కూడా లైట్ తీసుకోకూడదు. దీర్ఘకాలంగా అజీర్తి లేదా ఇతర జీర్ణ సమస్యలతో బాధపడుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించి సంబంధిత పరీక్షలు చేయించుకోవాలన నిపుణులు సూచిస్తున్నారు.

# గోర్లు కొరికే అలవాటు ఉందా?




ఒక్కోసారి గందరగోళం, ఆందోళన, భయం కారణంగా కొందరు గోర్లు కొరుకుతుంటారు. ఈ అలవాటు ఉన్న వారు ఏ మాత్రం ఒత్తిడి కలిగిన చేతి గోర్లు నోట్లో పెట్టుకుని నమలడం, కొరకడం చేస్తుంటారు. దీంతో గోర్లు విరగడంతోపాటు అనేక సమస్యలను కలిగిస్తాయి. గోర్లు కొరికే అలవాటు మీకు కూడా ఉంటే ఎలాంటి సమస్యలు వస్తాయో ఇక్కడ తెలుసుకోండి.. సాధారణంగా ఆందోళన లేదా నెర్వస్‌నెస్ కారణంగా దానిని ఎలా వ్యక్తీకరించాలో తెలియక చాలా మంది గోళ్లు కొరుకుతుంటారు. ఇలా గోళ్లు కొరుకుతూ భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తారు. అయితే, ఇది మంచి పద్ధతి కాదు. ఇది పలు రకాల శారీరక సమస్యలను కలిగిస్తుంది. మీ గోళ్లను కోరికే అలవాటును వీలైనంత త్వరగా మానుకోవాలి. గోరు కొరకండ వల్ల శరీరంపై ఈ విధమైన చెడు ప్రభావాలు పడతాయి. గోరు కొరకడం వల్ల గోళ్ల నిర్మాణం దెబ్బతింటుంది. గోళ్లు కొరకడం వల్ల దంతాలు సైతం దెబ్బతింటాయి. గోరు కొరకడం వల్ల నోట్లో చిగుళ్లు దెబ్బతింటాయి. గోరు కొరకడం వల్ల గోరు చుట్టూ ఉన్న చర్మం పొడిబారడంతోపాటు పొరలుగా మారి ఊడిపోతుంది. ఇది ఆరోగ్యకరం కాదు, ఆరోగ్యానికి మంచిది కాదు. గోరు కొరకడం జీర్ణవ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. గోళ్లను నమలడం వల్ల అనేక రకాల బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించి వివిధ రకాల కడుపు సమస్యలను కలిగిస్తుంది.గోళ్లలోని మురికి నోటిలో పేరుకుపోయి జలుబు, ఇతర అంటు వ్యాధులు వస్తాయి. గోళ్లు కొరకడం వల్ల పెద్దపేగు క్యాన్సర్ కూడా వస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

# పిల్లలకు ఫోన్ ఇవ్వాల్సిన సరైన వయసు



డెయిలీ లైఫ్‌లో సెల్ ఫోన్స్ వాడకం ఎక్కువైపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పిల్లలను వీటికి దూరంగా ఉంచాలని నిపుణులు హెచ్చరిస్తుండగా.. ఈ డిజిటల్ యుగంలో వారిని ఎలా కంట్రోల్ చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఇంతకీ ఏ వయసులో పిల్లలకు ఫోన్ ఇవ్వొచ్చు? ఏ ఏజ్‌లో ఎంత స్క్రీన్ టైమ్ ఉండాలి? అనే విషయాల్లో కూడా అనుమానాలు ఉండగా.. ఇక్కడ కొన్ని సూచనలు అందిస్తున్నారు నిపుణులు. ఆరేళ్లు అంతకంటే ఎక్కువ వయసు కలిగిన పిల్లలకు ఫోన్ ఇవ్వొచ్చని సూచిస్తున్నారు ఎక్స్‌పర్ట్స్. అది కూడా రోజులో రెండు గంటలు మాత్రమేనని చెప్తున్నారు. ఇక ఆరేళ్ల కన్నా తక్కువ ఉన్న వారికి గంట సమయం రెకమెండ్ చేస్తున్నారు. అయితే పద్దెనిమిది నెలల కన్నా తక్కువ ఉన్న చిన్నారులను అస్సలు అనుమతించకూడదని హెచ్చరిస్తున్నారు. లేదంటే బ్రెయిన్ డెవలప్మెంట్, కంటి చూపు, ఫోకస్ చేయడంలో లోపం ఏర్పడుతుందని చెప్తున్నారు. సోషల్ ఇంటరాక్షన్, క్రియేటివిటీ,మోటార్ స్కిల్స్ డెవలప్మెంట్ కోసం ఆఫ్ స్క్రీన్ యాక్టివిటీస్ మస్ట్‌గా ఉండాలని సూచిస్తున్నారు. కుటుంబంతో స్పెండ్ చేయడం, బయట ఆడుకోవడం, కథలు చదవడం లాంటి అలవాట్లు నేర్పించాలని అంటున్నారు.ఇంట్లో ఫోన్ ఫ్రీ టైమ్ తప్పకుండా పాటించాలని.. డిన్నర్ తర్వాత అస్సలు మొబైల్స్ ముట్టకుండా ఉండాలని, ముఖ్యంగా బెడ్ రూమ్‌లో ఫోన్ అనుమతి ఉండకూడదని చెప్తున్నారు. పిల్లలు మారాం చేస్తే స్క్రీన్ టైమ్ షెడ్యూల్ చేయాలని.. హోమ్ వర్క్ ఫినిష్ చేసిన తర్వాత లేదంటే అప్పగించిన టాస్క్‌లు పూర్తి చేస్తేనే ఇస్తామని కండిషన్స్ పెట్టడం మంచిదని సూచిస్తున్నారు. అంతేకాదు టెక్నాలజీని ఎలా యూజ్ చేయాలి, ఎలా హ్యాండిల్ చేయాలనే విషయాలను పిల్లలకు దగ్గరుండి నేర్పించాలని.. అప్పుడే రాంగ్ కంటెంట్ చూడకుండా ఉండగలరని చెప్తున్నారు నిపుణులు.

# బాడీ పాలిషింగ్ అంటే ఏమిటి?



బాడీ పాలిషింగ్ అనేది ప్రసిద్ధ చర్మ చికిత్స, కాగా వివిధ స్క్రబ్‌లు, ఆయిల్స్ సహాయంతో చనిపోయిన చర్మ కణాలను తొలగిస్తారు. బాడీ మసాజ్, స్కిన్ మాయిశ్చరైజేషన్‌ను కూడా చేస్తారు. ఇది యవ్వనమైన మెరుపు, మృదువైన చర్మాన్ని అందిస్తుంది. అయితే ఈ ఎక్స్‌ఫోలియేషన్ చికిత్స కోసం మీరు సెలూన్‌కి లేదా క్లినిక్‌కి వెళ్లాల్సిన అవసరం లేదు. ఈ పూర్తి శరీర చికిత్సను ఇంట్లో కూడా చేయవచ్చు. మృదువైన బాడీ బ్రష్ తీసుకోండి. చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేయడానికి వృత్తాకార కదలికలలో సున్నితంగా బ్రష్ చేయండి. తడి చర్మంపై బాడీ స్క్రబ్‌ని అప్లై చేయండి. మళ్లీ అలాగే ముప్పై సెకన్ల పాటు మసాజ్ చేస్తూ ఉండండి. తర్వాత తేనె, పెరుగు, అలోవెరా జెల్ వంటి పదార్థాలను ఉపయోగించి హైడ్రేటింగ్ బాడీ మాస్క్‌ను అప్లై చేయండి. 15 నుంచి 20 నిమిషాల పాటు అలాగే ఉంచిన తర్వాత శుభ్రం చేయండి.మీ శరీరాన్ని సరిగ్గా శుభ్రపరచడానికి గోరు వెచ్చని నీరు ఉపయోగించండి. స్నానం చేసేటప్పుడు.. చర్మపు తేమ సమతుల్యత కోసం తేలికపాటి, హైడ్రేటింగ్ షవర్ జెల్ ఉపయోగించండి.స్నానం పూర్తయ్యాక బాదం నూనె లేదా కొబ్బరి నూనె వంటి బాడీ ఆయిల్‌ను అప్లై చేయండి. తేమను లాక్ చేయడానికి మీ చర్మంపై సున్నితంగా మసాజ్ చేయండి. ఎక్స్ఫోలియేషన్ : బాడీ పాలిషింగ్ ముఖ్య ఉద్దేశ్యం డెడ్ స్కిన్ సెల్స్ ను తొలగించి స్మూత్ టెక్చర్ ఇవ్వడం. ఇది ఎక్స్‌ఫోలియేటింగ్ స్క్రబ్‌ను ఉపయోగించడం ద్వారా చేయబడుతుంది. రక్త ప్రసరణలో సహాయం చికిత్సలో వృత్తాకార పద్ధతిలో మసాజ్ చేయడం జరుగుతుంది. 2005లో స్పోర్ట్స్ మెడిసిన్‌లో ప్రచురితమైన పరిశోధన ప్రకారం.. బాడీ మసాజ్ రక్త ప్రసరణను పెంచడం, కండరాల ఒత్తిడిని తగ్గించడం వంటి ప్రయోజనాలను అందిస్తుంది . అలాగే శరీరాన్ని వృత్తాకార పద్ధతిలో మసాజ్ చేసినప్పుడు.. పోషకాలు బాగా గ్రహించబడతాయి. చర్మ కణాలకు రక్త ప్రసరణ సరిగ్గా జరుతుంది. మచ్చల తగ్గింపు : బాడీ పాలిషింగ్ చికిత్స.. చర్మపు మచ్చలు, మొటిమల మచ్చలు కనిపించడాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఈ ప్రక్రియలో ఉపయోగించిన ఎక్స్‌ఫోలియేటర్‌లు రంగు మారిన ప్రాంతాన్ని పోగొట్టి.. చర్మం సమానంగా మృదువుగా కనిపించేలా చేస్తాయి. ఒత్తిడి తగ్గింపు: సైంటిఫిక్ రిపోర్ట్స్‌లో ప్రచురించబడిన 2020 అధ్యయనంలో 10 నిమిషాల బాడీ మసాజ్ ఒత్తిడిని అధిగమించడానికి, శరీర వ్యవస్థను సరిగ్గా చేయడంలో సహాయపడుతుందని కనుగొంది. బాడీ పాలిషింగ్ అనేది రిలాక్సేషన్ టెక్నిక్. ఇది మీకు ఒత్తిడి లేని, రిలాక్స్‌డ్ అనుభవాన్ని అందించడంలో సహాయపడుతుంది. రిథమిక్, సర్క్యులర్ మసాజింగ్ టెక్నిక్ ఓదార్పు, ప్రశాంతమైన అనుభవాన్ని అందించడానికి సహాయపడుతుంది.స్కిన్ మాయిశ్చరైజేషన్: ఎక్స్‌ఫోలియేషన్ ప్రక్రియను మాస్క్‌లు, షవర్ జెల్, ఆయిల్ ఉపయోగించి చేస్తారు. మృత చర్మ కణాలు తొలగించబడిన తర్వాత అవి చర్మంలోకి బాగా శోషించబడతాయి. స్కిన్ మాయిశ్చరైజ్డ్ గా ఉంటుంది. టాన్ తొలగిస్తుంది: అసమాన స్కిన్ టోన్ లేదా టాన్డ్ స్కిన్ ఉన్నవారికి ఇది బెస్ట్ చాయిస్. ఉదాహరణకు మీరు ఈ చికిత్సలో పెరుగును ఉపయోగిస్తే.. ఇందులోని లాక్టిక్ యాసిడ్ కారణంగా హైపర్పిగ్మెంటేషన్‌ను ఎదుర్కోగలదు.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110